


నేడు గాంధీ జయంతి

గాంధీ.. నడిచాడిక్కడ!

ఉమ్మడి తూర్పున బాపూజీ అడుగుజాడలు

మహాత్ముడి జీవితమే.. ఒక మహోద్యమం. చేతిలో ఊతకర్ర.. బక్కపలుచని శరీరం.. అదీ వయస్సుమీరిన రోజుల్లో ఎలాంటి ఆయుధం లేకుండా స్వాతంత్ర్యం సిద్ధించే దాకా జాతి యావత్తునూ ఏకతాటిపై నడిపించాడంటే ఆయనను మహాత్ముడుకాక ఇంకేమంటాం. అందుకే ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ గాంధీజీని ఉద్దేశించి చెప్పినట్టు "కొన్నేళ్ల తర్వాత రక్తమాంసాలు గల ఇలాంటి వ్యక్తి భూమ్మీద నడిచాడని చెబితే రాబోయే తరాల వారు నమ్మలేరు.." ఎంత గొప్ప నిర్వచనం ఇది. స్వాతంత్ర్య పోరాటం ఉవ్వెత్తున సాగుతున్న సమయంలో మన జాతిపిత దేశమంతటా పర్యటించారు. ప్రజలందరినీ స్వాతంత్ర్య సమరంలోకి దూకేలా ఉత్తేజితమైన ప్రసంగాలు చేశారు. పోరాటంలో ముందుండి నడిపించారు. మన గోదావరి జిల్లాల్లోనూ గాంధీజీ విస్తృతంగా పర్యటించి సమరశంఖం పూరించారు. ఆయన వెంట ప్రజలంతా ఏకమై నడిచారు. స్వరాజ్యం మా హక్కని ముక్తకంఠంతో నినదించారు. స్వాతంత్ర్య పోరులో జైళ్లకెళ్లారు. గాంధీజీ జయంతి సందర్భంగా ఆయన స్మృతులు మళ్లీ ముందుకు..

- రాజమండ్రి (ఆంధ్రజ్యోతి)/ కాకినాడ సిటీ/కరప


రాజమండ్రికి 5 సార్లు వచ్చింది..

1921 మార్చి 30వ తేదీ రాత్రి గాంధీ తొలిసారిగా రాజమహేంద్రవరంలో అడుగుపెట్టారు. విజయనగరంలో తన పర్యటన ముగించుకుని బెజవాడ మెయిల్‌లో వెళుతూ ఇక్కడి రైల్వే స్టేషన్‌లో ఆహ్వానం మేరకు దిగారు. 1921 ఏప్రిల్ 6వ తేదీన మహాత్మాగాంధీ దంపతులు కాకినాడ నుంచి రాజమహేంద్రవరం సభకు విచ్చేశారు. 1929 మే 6న గాంధీ మూడోసారి వచ్చారు. గాంధీజీ.. సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు టౌన్‌హాల్‌ను సందర్శించినట్టు చెబుతారు. 1933 డిసెంబర్ 24న ఆయన నాల్గోసారి పాల్ చౌక్‌లో ఆయన ప్రసంగించారు. ఐదోసారి అంటే చివరగా 1946 జనవరి 20 రాజమండ్రి వచ్చారు.

దక్షిణాఫ్రికా టూ తుని..

తుని రూరల్ : స్వాత్రంత్రోద్యమ పర్యటనకు ముందే గాంధీ తునిలో పర్యటించి బస చేశారు. ఆ ప్రాంతం ప్రస్తుతం గాంధీ సత్రంగా పేరుపడింది. 1915లో దక్షిణాఫ్రికా నుంచి భారతదేశానికి వచ్చిన గాంధీజీ దేశ ప్రజల స్థితిగతులను తెలుసుకునేందుకు దేశ పర్యటనలో భాగంగా 1916లో రైలులో మార్గమధ్యలో తునిలో ఆగారు. తునికి ప్రధాన కూడలిగా ఉన్న గొల్లప్రోలు సెంటర్ పక్కనే సత్రం ప్రాంగణంలో ఒక పెద్ద చెట్టు కింద ఈ ప్రాంత వాసులతో సభ నిర్వహించి స్వాతంత్ర్య స్ఫూర్తిని నింపారు. ఆ రాత్రి అక్కడే బస చేసి మరుసటిరోజే పయనమయ్యారు.

కాకినాడలో మ్యూజియం



కార్పొరేషన్(కాకినాడ): స్వాతంత్రోద్యమ సమయం 1921 నుంచి 1929 మధ్యలో మూడుసార్లు గాంధీజీ కాకినాడ వచ్చారు. గాంధీజీ ఇక్కడికి వచ్చినప్పటి విషయాలతో పాటు ఆయన బాల్యం నుంచి స్వాతంత్ర్యం సాధించే వరకు ఉన్న జీవిత ఘట్టాలను తెలియజేస్తూ కాకినాడ కార్పొరేషన్ వెనుక ప్రాంతంలో గాంధీభవన్ ఏర్పాటు చేశారు. ఇందులో గాంధీజీ మ్యూజియం, ఆయన చిత్రపటాలతోపాటు 400 కిలోల కాంస్య విగ్రహం ఏర్పాటుచేశారు. ఆయనను నిత్యం స్మరించుకునేలా గాంధీనగర్‌లో ఓ పార్కుకు గాంధీపార్కుగా, ఓ ప్రాంతానికి గాంధీనగర్‌గా అప్పట్లోనే నామకరణం చేశారు. కాకినాడ గాంధీభవన్ పేరున కరపలో 5.87 ఎకరాల భూమి ఉంది. వేళంగి గ్రామానికి చెందిన మెర్ల వెంకటసుబ్బారావు 1952 ఆగస్టు 5న తన స్వార్జిత భూమిని గాంధీభవన్ ట్రస్ట్‌కు రాసిచ్చారు.

కాకినాడకు మూడుసార్లు..

స్వాతంత్రోద్యమకాలంలో మహాత్మాగాంధీ కాకినాడలో మూడుసార్లు పర్యటించారు. 1921 ఏప్రిల్ 3న కాకినాడలో గాంధీజీ దంపతులు, వారి నాలుగో కుమారుడు రైలు దిగారు. గుర్రపు బండిపై పెద్ద బజారు గుండా జగన్నాథపురంలోని పైడా వెంకట నారాయణ ఇంటికి చేరుకున్నారు. 1923 డిసెంబర్ 28న గాంధీనగర్‌లో జరిగిన అఖిలభారత కాంగ్రెస్ సభలకు జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయి పటేల్ వంటి నేతలు విచ్చేయగా, పరవాడ జైలులో ఉన్న కారణంగా మహాత్మాగాంధీ హాజరు కాలేకపోయారు. ఆ తర్వాత 1930, 1933లలో రెండుసార్లు కాకినాడ వచ్చిన గాంధీ స్వాతంత్రోద్యమ సభల్లో పాల్గొన్నారు.

సీతానగరంలో సత్యాగ్రహాశ్రమం

సీతానగరం: రాజమహేంద్రవరానికి 25 కి.మీ దూరంలో ఉన్న సీతానగరంలో 1924 నవంబరు 9న వైద్యుడు బ్రహ్మజ్యోస్యుల సుబ్రహ్మణ్యం గోదావరి గట్టుకు సమీపంలో గౌతమి సత్యాగ్రహ ఆశ్రమం పేరుతో ఏర్పాటుచేశారు. దీనికి అల్యూమినియం వ్యాపారి శేఠ్ జీవన్‌లాల్ ఆర్థిక సాయం అందించారు. ఈ ఆశ్రమాన్ని బాపూజీ రెండుసార్లు సందర్శించడం విశేషం. 1925 ఫిబ్రవరి 4న డాక్టర్ బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం ఇక్కడ గృహ ప్రవేశం జరిపారు. గాంధీజీ తన స్వాతంత్రోద్యమ పర్యటనలో భాగంగా 1929 మే 8, 9 తేదీల్లో ఆశ్రమంలో బస చేశారు. 1933 డిసెంబరులో ఈ ఆశ్రమానికి రెండోసారి వచ్చి ఆశ్రమవాసులను ఉత్తేజపర్చారు. బాపూజీ సతీసమేతంగా ఆశ్రమంలో విశ్రాంతి తీసుకున్నారు. కస్తూర్బాగాంధీ పరమపదించిన అనంతరం ఆమె పేరుతో గౌతమి సత్యాగ్రహాశ్రమానికి కస్తూర్బాగాంధీ ఆశ్రమంగా పేరు మార్చారు.



గాంధీ బసచేసిన చోడవరంలో భవనం ఇదే

నేటికీ ఆ గాంధీ భవన్‌లు పదిలమే!

ద్రాక్షారామ/రాజోలు: మహాత్మాగాంధీ స్వాతంత్ర్య పోరాటంలో 1929 ఏప్రిల్, మే నెలల్లో ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించారు. మే నెలలో రామచంద్రపురం మండలం వెల్ల, చోడవరం గ్రామాల్లో గాంధీజీ పర్యటించారు. మే 1న వెల్ల వంతెన వద్ద బహిరంగ సభలో ప్రసంగించారు. అనంతరం సాయంత్రానికి చోడవరం చేరుకుని రాత్రి బిక్కిన వెంకటరత్నం (మాజీ కేంద్ర మంత్రి) నివాసంలో బసచేశారు. ఆ భవనం ఇప్పటికీ చెక్కు చెదరలేదు. 1929 మే 5న ఆదివారం గాంధీ అమలాపురం మీదుగా సాయంత్రం 6 గంటలకు మామిడికుదురు మండల పాశర్లపూడి రేవు దాటారు. గాంధీ తన సహచరి కస్తూరిబాతో రాత్రి 8 గంటలకు పొన్నాడ సూర్యారావు ఇంటికి అతిథిగా విచ్చేశారు. వారికి అపూర్వమైన ఆతిథ్యాన్ని సూర్యారావు అందించారు. ఆ రాత్రి గాంధీజీ మౌనవ్రతం చేశారు. 1929 మే 5, 6 తేదీల్లో పొన్నాడ సూర్యారావు ఇంట్లోనే గాంధీ బస చేయడం విశేషం. అప్పటి నుంచి ఆ ఇల్లు గాంధీ హౌస్ అయింది.



తొలిరోజే.. 98.43

పింఛన్ల పంపిణీలో అద్వితీయం

- రాష్ట్రంలో రెండో స్థానం
- సచివాలయ సిబ్బంది పట్టుదల
- ఉదయం 5 నుంచే ఆరంభం
- రాత్రి 8 గంటల వరకూ పంపిణీ
- ఇంటింటికీ వెళ్లి అందజేత
- కోలమూరు సర్వేయర్ చేతివాటం
- సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు

రాజమహేంద్రవరం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) :ఓ విజన్.. ఓ పద్ధతి.. ఓ ప్రణాళిక.. ఈ విధానమే కూటమి ప్రభుత్వం వచ్చాక ఒకటో తేదీన ఠంచనుగా పింఛను చేతికందిస్తోంది.. చంద్రబాబు అధికారంలోకి వస్తే ఎలా ఉంటుందో పింఛను నుంచే చేసి చూపిస్తున్నారు. వలంటీర్లు లేకపోయినా తొలి రోజునే ఏకంగా 98 శాతానికి పైగా లబ్ధిదారులకు అందజేసి రికార్డు సృష్టిస్తున్నారు. ఈ నెల కూడా మంగళవారం తెల్లవారుజాము నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభించారు.మంగళవారం ఉదయం 5.30 గంటలకు యాప్ ఓపెన్ అయ్యింది. ఆ మరుక్షణమే 4,896 మంది సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు చేరుకొని రూ.4 వేల పింఛను సొమ్మును చేతిలో పెట్టారు. ఉదయం 8 గంటలకే 78% పింఛన్లు పూర్తయ్యాయి. దీంతో తూర్పుగోదావరి జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలోకి చేరింది.తర్వాత 12 గంటలకు 95 శాతం, సాయంత్రం 7 గంటలకు 98.37 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయింది. అంటే సుమారు 14 గంటల్లో జిల్లాలో మొత్తం 2,39,021 పింఛను లబ్ధిదారులు ఉండగా సాయంత్రం 7 గంటల సమయానికి 2,35,123 మందికి పింఛన్లు అందజేశారు. రాత్రి 8 గంటలకు 98.43 శాతం పింఛన్లు అందజేశారు.రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలిచారు. వివిధ కారణాలతో ఇళ్ల వద్ద లేకపోయిన వాళ్లు మినహా దాదాపుగా అందరు లబ్ధిదారులు పింఛను అందుకొన్నారు.

71 బ్రాంచిలు.. రూ.101 కోట్లు డ్రా

జగన్ ప్రభుత్వంలో పింఛన్ల పంపిణీ పెద్ద క్రతువులా వారం రోజులు సాగేది. అయితే కూటమి ఓ పద్ధతి ప్రకారం పింఛన్ల పంపిణీ చేస్తుండడంతో అటు లబ్ధిదారులు, ఇటు ఉద్యోగుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. జిల్లా కలెక్టర్ ప్రశాంతి పక్కా ప్లానింగ్ చేస్తున్నారు. డీఆర్‌డీఏ పీడీ సమన్వయం చేసుకుంటున్నారు. పింఛన్ల పంపిణీకి ముందు రోజున లబ్ధిదారులకు ఓ మెసేజ్ పంపిస్తున్నారు. రేపు ఉదయం ఇంటికి వచ్చి పింఛను అందజేస్తాం.. అందుబాటులో ఉండాలని దాని సారాంశం. మరోవైపు డబ్బులు బ్యాంకుల నుంచి డ్రా చేసి సిబ్బందికి అందజేసే ప్రక్రియ జరుగుతోంది. ఈ నెలకు సంబంధించి మొత్తం 71 బ్యాంకు బ్రాంచిల్లో రూ.101 కోట్లను సోమవారం సాయంత్రమే డ్రా చేశారు. వాటిని సిబ్బందికి పంపిణీ చేశారు. దీంతో మంగళవారం తెల్లవారుజామున యాప్ ఓపెన్ కాగానే అప్పటికే సిద్ధంగా ఉన్న సిబ్బంది పింఛన్ల పంపిణీని మొదలు పెట్టారు.

కోలమూరులో సర్వేయర్ చేతివాటం



రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 1 : రాజమహేంద్రవరం రూరల్ మండలం కోలమూరు సచివాలయం-2 లో సర్వేయర్ కె.వెంకటాచారి చేతివాటం ప్రదర్శించి సస్పెన్షన్‌కు గురయ్యారు.ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో భాగంగా లబ్ధిదారులకు చెల్లించాల్సిన రూ.4 వేలలో రూ.300 తగ్గించి పంపిణీ చేస్తున్నాడు.ఇదేంటని లబ్ధిదారులు ప్రశ్నించగా కొందరి వద్ద దసరా మామూళ్లు అని మరికొందరి వద్ద వరద బాధితులకు పంపాలంటూ పొంతన లేని కారణాలు చెప్పడంతో లబ్ధిదారులు పంచాయతీ కార్యదర్శితో పాటు టీడీపీ నాయకులకు సమాచారం అందించారు.ఈ మేరకు లబ్ధిదారులు సమక్షంలో వెంకటాచారిని విచారించి రూ.300 ఇప్పించామని కార్యదర్శి విజయ్‌రెడ్డి తెలిపారు. 18 మంది లబ్ధిదారులకు రూ.300 తక్కువ ఇచ్చినట్టు గుర్తించామన్నారు. దీనిపై తగు చర్యలు నిమిత్తం రూరల్ ఎంపీడీవోకు నివేదిక పంపించారు.ఈ మేరకు సమాచారం అందడంతో కలెక్టర్ ప్రశాంతి వెంటనే సస్పెన్షన్ చేశారు.



విజ్జేశ్వరంలో పింఛను అందజేస్తున్న మంత్రి దుర్గేష్

అర్హులందరికీ పింఛన్లు : దుర్గేష్

నిడదవోలు, అక్టోబరు 1 : కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీకి కట్టుబడి జిల్లా వ్యాప్తంగా 2,39,021 మందికి రూ.101.95 కోట్లు సామాజిక భద్రత పింఛన్లు ఇంటి వద్దనే పంపిణీ చేస్తున్నామని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు మండలం విజ్జేశ్వరం గ్రామంలో మంగళవారం ఎన్టీఆర్ భరోసా పింఛను పంపిణీ చేసి మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు అందిస్తున్నామన్నారు. విజ్జేశ్వరం గ్రామానికి చెందిన బ్రెయిన్ ఆపరేషన్ జరిగిన పేషెంట్ సత్యనారాయణకు రూ.15 వేలు పెన్షన్ అందించారు.

నవరాత్రి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు : ఎస్పీ

రాజమహేంద్రవరం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : నవరాత్రి ఉత్సవాలకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశామని.. ఉత్సవ నిర్వహణా కమిటీలు.. ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్పీ నరసింహ కిషోర్ పేర్కొన్నారు. నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి దేవీచౌక్ తదితర చోట్ల మంగళవారం ఎస్పీ పరిశీలన చేసి ఉత్సవ నిర్వాహకులతో చర్చించి పలు సూచనలు చేశారు.ఎలాంటి అవాంఛనీయ ఘటనలకూ తావు లేకుండా సిబ్బందిని నియమించామన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఎక్కడైనా అశ్లీల నృత్యాలు, అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉత్సవ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలన్నారు.

పట్టాభూముల్లోనూ ఇసుక తీతలు 7
వెదుళ్లపల్లి సొసైటీలో రూ.56 లక్షలు మాయం 8
కడియపులంక డ్వాక్రాలో రూ.30 లక్షలు గోల్‌మాల్

రూ.6 లక్షలు నొక్కేసి.. 25 మందిని వదిలేశారు?

- ఖాకీలకు వాటాల్లో తేడా..
- రంగంలోకి ఎస్పీ..
- డీఎస్పీ రహస్య విచారణ

రాజమహేంద్రవరం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): జూద శిబిరానికి వెళ్లారు.. పేకాట ఆడుతున్న వాళ్లను చప్పున పట్టేశారు.. చట్ట ప్రకారం నడుచుకుంటే జేబు నిండుతుందా?అని ఎప్పటి మాదిరిగానే అనుకున్నారు.. చట్టాలను బ్రేక్ చేశారు.. కొంత వెనక్కి ఇచ్చేశారు.. మరి కొంత నొక్కేశారు.. వడ్డించుకోవడంలో తేడాలు రావడంతో ఆ ఖాకీల బాగోతం జిల్లా పోలీస్ బాస్ చెవిలో పడింది. దీంతో ఎస్పీ నరసింహ కిషోర్ రహస్య విచారణకు ఆదేశించారు. గత నెల 8న జరిగిన ఈ కథను ఆరాతీస్తే.. పెరవలి మండలం ముక్కామల గ్రామ పరిధి పశ్చిమ, తూర్పుగోదావరి సరిహద్దులో పేకాట శిబిరం నిర్వహిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. పెరవలి ఎస్ఐ ముగ్గురు సిబ్బందితో కలిసి వెళ్లి శిబిరంపై దాడి చేశారు.సుమారు 30 మందిని అదుపులోకి తీసుకున్నారు. వాళ్ల వద్ద ఉన్న దాదాపు రూ.8 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. కాస్త హడావుడి అనంతరం బేరం కుదిరింది. రూ.50 వేలు కేసులో చూపించారు.జూదరులకు రూ.1.50 లక్షలు తిరిగిచ్చేశారు. మిగతా రూ.6 లక్షలు యూనిఫాంలో తోసేశారు.30 మంది పట్టుబడితే ఒప్పందం ప్రకారం ఐదారుగురిని కేసులో చూపించారు. ఎందుకంటే వీరిలో పలువురు వైసీపీ నాయకులు ఉన్నట్టు సమాచారం. వాటాల పంపకాల్లో తేడాలు రావడంతో నిఘా విభాగానికి ఉప్పందింది.సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ అంతర్గత విచారణకు ఆదేశించారని సమాచారం. దీంతో గత మూడు రోజులుగా ఆ రోజు పోలీసులు దాడి చేసినప్పుడు దొరికిన నిందితులు అందరినీ విడతల వారీగా రప్పించి కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ రహస్యంగా విచారణ చేస్తున్నారు.ఆ రోజు తమ దగ్గర డబ్బులు నొక్కేసి, కేసు నుంచి తప్పించిన విషయం వాస్తవమేనని నిందితులు ఒప్పుకున్నట్టు తెలుస్తోంది. నిడదవోలు సీఐకి మొత్తం తతంగం తెలుసని పెరవలి ఎస్ఐ చెబుతుంటే.. తనకు ఏమీ తెలియదని సీఐ అంటున్నారని చెబుతున్నారు. ప్రజాప్రతినిధుల సహాయంతో బయట పడే పనిని ఎస్సై, సీఐ మొదలు పెట్టారని సమాచారం.



మందడుగు!

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

- కొత్త మద్యం పాలసీ విడుదల
- 9 వరకూ దరఖాస్తుల స్వీకరణ
- జిల్లాలో 125 ప్రైవేటు షాపులు
- 11న లాటరీ.. 12 నుంచి అమలు
- నేతల తీవ్ర ప్రయత్నాలు

మందుబాబులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ప్రైవేటు మద్యం షాపులు విజయదశమి నుంచి అందుబాటులోకి రానున్నాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో నాసిరకం మద్యంతో నలిగిపోయిన మద్యపాన ప్రియులకు కాస్త సాంత్వన కలగనుంది. నాణ్యమైన మద్యం సరసమైన ధరకే గొంతులో పడనుంది.ఈ మేరకు మంగళవారం కూటమి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది.జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సీహెచ్ లావణ్య జిల్లా లైసెన్సింగ్ అథారిటీ హోదాలో గజిట్ నోటిఫికేషన్‌ని విడుదల చేశారు.

జిల్లాలో 125 షాపులు

జిల్లాలోని ఒక కార్పొరేషన్,రెండు మునిసిపాలిటీలు, 18 పంచాయతీలతో కలిపి మొత్తం 125 ప్రైవేటు మద్యం షాపులకు నోటిఫికేషన్ విడుదల చేశారు. దీని ప్రకారం 9వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.10న శాఖాపరమైన ప్రక్రియ జరుగుతుంది. 11న రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో కలెక్టర్ ప్రశాంతి సమక్షంలో ఉదయం 8 గంటల నుంచి లాటరీ తీస్తారు. 12న విజయ దశమి నాటి నుంచి కొత్త మద్యం షాపులు అందుబాటులోకి వస్తాయి.ముందుగా ప్రొవిజనల్ లైసెన్సు జారీ చేస్తారు.అనంతరం షాపులను తనిఖీ చేసి నిబంధనల మేరకు ఉంటే రెగ్యులర్ లైసెన్స్ ఇస్తారు.ఇక, దరఖాస్తు రుసుం రూ.2లక్షలుగా నిర్ణయించారు.షాపు లాటరీలో రాకున్నా ఈ డబ్బులను వెనక్కి తిరిగివ్వరు. రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో 28,రూరల్ మండలంలో 11, ఇతర మండలాల్లో 90 షాపులకు నోటిఫికేషన్ ఇచ్చారు. లైసెన్సు ఫీజు రెండు నెలలకోసారి చెల్లించే అవకాశాన్ని కల్పించారు.

ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు ఇక్కడే?

ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అధిక శాతం మంది ఆఫ్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకొనే అవకాశం కనిపిస్తోంది. రాజమహేంద్రవరం సిటీలోని 1-15, 23, 24, 29-50 డివిజన్లు రాజమహేంద్రవరం నార్త్ ఎక్సైజ్ స్టేషన్. 16-22, 25-28 డివిజన్లు రాజమహేంద్రవరం సౌత్ స్టేషన్‌లో దరఖాస్తులు సమర్పించవచ్చు. సీతానగరం స్టేషన్‌లో కోరుకొండ, సీతానగరం, గోకవరం, కొవ్వూరు స్టేషన్‌లో కొవ్వూరు, తాళ్లపూడి, చాగల్లు, దేవరపల్లి స్టేషన్‌లో గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల, నిడదవోలు స్టేషన్‌లో నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం, రంగంపేట స్టేషన్‌లో అనపర్తి, రంగంపేట, బిక్కవోలు దరఖాస్తులు చేసుకోవచ్చు.

నేతల పట్టు?

బినామీ పేర్లతో మద్యం దుకాణాలు దక్కించుకొని ఆ వ్యాపారాన్ని తమ గుప్పిట్లో పెట్టుకోవాలని వైసీపీ నేతలు వ్యూహరచన చేస్తున్నారు.జిల్లాలోని వైసీపీ మాజీ ప్రజాప్రతినిధులు ఈ పనుల్లో బిజీగా ఉన్నారు. ఓ సామాజిక వర్గానికి చెందిన వాళ్లు ఈ వ్యాపారంలో ఎక్కువగా ఉన్నారు. ఆ సామాజికవర్గం జగన్‌కి కొమ్ముకాస్తూ ఉంటుందనేది బహిరంగ రహస్యం.ఈ మేరకు తమకు సహకరించాలంటూ ఇప్పటికే ఎక్సయిజ్ శాఖలోని కొందరు అధికారులకు ఇప్పటికే తాయిలాలు ఎరగా చూపుతున్నట్టు చెబుతున్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో సొమ్ములతో మళ్లీ మంచి పోస్టింగ్‌లు పట్టుకున్న ఆ అధికారులు లోపాయికారిగా ఒప్పందాలకు సై అన్నట్టు శాఖావర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మరోవైపు కూటమి నేతలు చాలా మంది మద్యం షాపులను ఎలాగైనా దక్కించుకోవాలని చూస్తున్నారు.ఈ మధ్య ఎక్సయిజ్ శాఖలో బదిలీలు జరిగాయి.స్టేషన్లు, ప్రాంతాల ప్రకారం ధరలు నిర్ణయించి పోస్టింగ్‌లకు సిఫారసు లేఖలు ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయి.దీంతో వైసీపీకి అనుకూలమైన అధికారులకు కీలకమైన సీట్లు దక్కాయి. సిఫారసు లేఖలు ఇచ్చే సమయంలో తాము మద్యం షాపులకు దరఖాస్తు చేస్తామని అమ్మకాలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో షాపులు తమకు దక్కేలా సహాయం చేయాలని 'మాట' తీసుకున్నట్టు చెబుతున్నారు.

ఎక్కడెక్కడ ఎన్ని..

మండలం	షాపులు
రాజమండ్రి అర్బన్	28
రాజమండ్రి రూరల్	11
అనపర్తి	06
బిక్కవోలు	05
చాగల్లు	04
దేవరపల్లి	05
గోకవరం	05
గోపాలపురం	03
కడియం	06
కోరుకొండ	04
కొవ్వూరు అర్బన్	03
కొవ్వూరు రూరల్	05
నల్లజర్ల	06
నిడదవోలు రూరల్	05
నిడదవోలు అర్బన్	04
పెరవలి	05
రాజానగరం	07
రంగంపేట	02
సీతానగరం	02
తాళ్లపూడి	04
ఉండ్రాజవరం	05
మొత్తం	125

గీత కార్మికులకు మరో నోటిఫికేషన్

కల్లుగీత గీత కార్మికులకు మద్యం షాపుల్లో 10 శాతం రిజర్వేషను కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. దానికి సంబంధించి మరో నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ప్రస్తుతం జిల్లాలో 125 షాపులకు నోటిఫికేషన్ విడుదలైంది. అంటే కల్లుగీత కార్మిక వర్గాలకు 12/13 షాపులను కేటాయించే అవకాశం ఉంది. ప్రస్తుత నోటిఫికేషన్‌లో షాపులు దక్కని వాళ్లుఆ కార్మిక వర్గాలను ప్రసన్నం చేసుకునే అవకాశం ఉంది.

లాటరీ పారదర్శకంగా నిర్వహిస్తాం..



కొత్త మద్యం పాలసీ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా ఆరోపణలకు తావు లేకుండా నిర్వహిస్తాం. దరఖాస్తు తనిఖీ ప్రక్రియ అంతా ప్రభుత్వ నిబంధనలకు లోబడి జరుగుతుంది. నిబంధనలు పరిశీలించుకొని తగు పత్రాలు, సమాచారాన్ని జత చేసి దరఖాస్తులను సమర్పించాలి. **- లావణ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్**



నిడదవోలులో బార్ వద్ద బైక్‌ల బారులు

మందుబాబుల క్యూ

సర్కారు షాపులు మూత..బార్ల వద్ద రద్దీ

నిడదవోలు, అక్టోబరు 1 : ప్రభుత్వ మద్యం దుకాణాలు మూతపడడంతో మద్యం ప్రియులంతా బార్లకు పోటెత్తారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ మద్యం దుకాణాలకు సోమవారంతో గడువు ముగిసింది. దాంతో పాటు మద్యం దుకాణాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది కాంట్రాక్ట్ గడువు ముగిసింది. కూటమి ప్రభుత్వం కొత్త మద్యం పాలసీ అమల్లోకి వచ్చే అక్టోబరు 12వ తేదీ వరకు ప్రభుత్వ మద్యం దుకాణాలు తెరిచేలా అనుమతులిచ్చింది. కానీ కొన్నిచోట్ల కాంట్రాక్ట్ సిబ్బంది విధులకు హాజరుకాకపోవడంతో మంగళవారం నుంచి జిల్లావ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో మద్యం దుకాణాలు మూతపడ్డాయి. దీంతో మద్యం ప్రియులు బార్ల వద్ద క్యూకట్టారు. దీంతో బార్ల వద్ద ఇసుకేస్తే రాలని పరిస్థితి నెలకొంది. నిడదవోలు పట్టణ పరిధిలో మూడు, మండలంలో ఏడు ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నాయి. సోమవారం మొత్తం 7 షాపులు మూతపడ్డాయి. ఇప్పటికే పట్టణంలో మూడు బార్లకు గాను లైసెన్స్ ఫీజులు భారమై రెండు మూతపడ్డాయి.ఈ నేపథ్యంలో గణేష్‌చౌక్ సెంటరులో మిగిలి ఉన్న ఒకే ఒక్క బార్ అండ్ రెస్టారెంటు మద్యం ప్రియులతో కళకళలాడింది. బయట పార్కింగ్‌కు సైతం ఖాళీ లేక మద్యం ప్రియులు తమ మోటారు సైకిళ్ళను రోడ్లపై పార్క్ చేశారు. సోమవారం ప్రభుత్వ మద్యం దుకాణాలు మూతపడగా బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకుని ఎలాగూ మూసివేస్తారు.ఎక్సైజ్ సిబ్బంది గురువారం నుంచి మద్యం షాపులు తెరచి విక్రయాలు సాగిస్తారని సమాచారం. దీం తో మందుబాబు మంగళవారం తెగతాగేశారు. బుధవారం సెలవు కావడంతో బాటిళ్లకు కొనుగోలు చేసి తీసుకెళ్లారు.

రావి ఆకుపై గాంధీజీ చిత్రాలు





రావి ఆకుపై గాంధీ చిత్రం చెక్కిన ఉపాధ్యాయుడు పిల్లి గోవిందరాజులు

గొల్లప్రోలురూరల్, అక్టోబరు 1: జాతి పిత మహాత్మాగాంధీ చిత్రాన్ని రావి ఆకుపై చెక్కారు కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చెందుర్తి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు పిల్లి గోవిందరాజులు. లీఫ్ కార్వింగ్ కళ ద్వారా రావి ఆకుపై గాంధీజీ చిత్రాన్ని చిత్రించి దానిని చెక్కారు. బాపూజీ చేసిన దేశానికి చేసిన సేవలు, ఉద్యమం గురించి విద్యార్థులకు వివరించారు. గోవిందరాజులును ఎంఈవోలు వెంకటేశ్వరరావు, శివప్రసాద్, హెచ్ఎం సురేష్‌కుమార్‌లు అభినందించారు.



వాటర్ కలర్స్‌తో..

రాయవరం: జాతిపిత గాంధీజీ పుట్టిన రోజును పురస్కరించుకుని రాయవరం గ్రామానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు ఇందుగమెల్లి సౌదాగర్ రెండు గంటలు శ్రమించి వాటర్ కలర్స్‌ను ఉపయోగించి రావి ఆకుపై గాంధీజీ చిత్రాన్ని చిత్రీకరించాడు.

రావి ఆకుపై చిత్రకారుడు సౌదాగర్ చిత్రించిన గాంధీజీ చిత్రం

రాగులు, ఇసుక, చోళ్లు, కాఫీ పౌడర్‌తో..



అంగర విద్యార్థినులు రూపొందించిన గాంధీజీ చిత్రపటాలు



గాంధీజీ చిత్రపటాన్ని రూపొందిస్తున్న అంగర పాఠశాల విద్యార్థినులు

కపిలేశ్వరపురం: అంగర జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు రాగులు, ఇసుక, చోళ్లు, కాఫీ ఫౌడర్‌తో గాంధీజీ చిత్రాలను చిత్రీకరించారు. పాఠశాల చిత్రలేఖనం ఉపాధ్యాయుడు దాసర వెంకటేష్ పర్యవేక్షణలో విద్యార్థునులు గాంధీజీ చిత్రాలు చిత్రీకరించారు. పాఠశాల హెచ్ఎం ఎ.రాజు విద్యార్థులను అభినందించారు.

అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- రూ.70లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం
- 40కు పైగా కేసుల్లో ఉన్న నలుగురు సభ్యుల ముఠా
- కిమ్స్ వెంకటేశ్వరాలయం కేసు ఛేదించిన పోలీసులు
- చోరీ సొత్తు బంగారం, వెండి మొత్తం రికవరీ
- కేసు ఛేదించిన పోలీసులకు రివార్డులు అందించిన ఎస్పీ
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ కృష్ణారావు



కిమ్స్ వెంకటేశ్వరాలయంలో చోరీకి గురైన ఆభరణాలను రికవరీ చేసి చూపిస్తున్న ఎస్పీ కృష్ణారావు

అమలాపురం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): జల్సాలు, చెడు వ్యసనాలకు అలవాటు పడి వివిధ రాష్ట్రాల్లో భారీగా దొంగతనాలు, దోపిడీలకు పాల్పడ్డ నలుగురు సభ్యుల అంతర్‌రాష్ట్ర ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు రూ.70లక్షల విలువైన చోరీ సొత్తును డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఉభయ రాష్ట్రాల్లో 40కు పైగా చోరీలకు పాల్పడ్డ ఈ ముఠాను తొలిసారిగా అరెస్టు చేసినట్టు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు వెల్లడించారు. ఈ కీలక కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం అమలాపురంలోని ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో వివరించారు. అమలాపురం పట్టణానికి సమీపంలో ఉన్న కిమ్స్ వైద్య కళాశాలలో గల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గతనెల 4వ తేదీ అర్ధరాత్రి జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు ఛేదించి నిందితులను నుంచి సుమారు రూ.70లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. 868 గ్రాముల బంగారు ఆభరణాలు, 8.56 కిలోల వెండి ఆభరణాలను నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ చెప్పారు. కిమ్స్‌లోని వేంకటేశ్వరాలయంలో చోరీ సొత్తు మొత్తం నిందితుల నుంచి రకవరీ చేసిన పోలీసులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. శ్రీకాకుళం జిల్లా గుర్రాలమెట్ట గ్రామానికి చెందిన సవర సూర్యం అలియాస్ సూర్య (25), సవర చిన్నారావు అలియాస్ చిన్నా (24), జోగివలస గ్రామానికి చెందిన సవర రజనీ (24), తెలంగాణా రాష్ట్రంలోని మెదక్ జిల్లా మీంపూర్ గ్రామానికి చెందిన బత్తిన శ్రీకాంత్ (25) ఒక బృందంగా ఏర్పడి ఉభయ రాష్ట్రాలతో పాటు వివిధ ప్రాంతాల్లో భారీగా దేవాలయాలను లక్ష్యంగా చేసుకుని దోపిడీలకు పాల్పడుతున్నారు. చెడు వ్యసనాలు, జల్సాలకు అలవాటు పడ్డ వీరు వ్యూహాత్మకంగా ఎంపిక చేసుకున్న ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించి పక్కా వ్యూహంతో దోపిడీలు చేయడం అలవాటు చేసుకున్నారు. ఈ ముఠా సభ్యులు ఒక కారును అద్దెకు తీసుకుని చోరీ చేయాలనుకున్న దేవాలయాలవద్ద ముందుగా రెక్కీ నిర్వహించి ఆ తరువాత చోరీకి పాల్పడుతుంటారు. ఈవిధంగా అమలాపురంలోని కిమ్స్‌లోని వెంకటేశ్వరాలయానికి వచ్చి రెక్కీచేసి గతనెల 4వ తేదీ రాత్రి భారీ చోరీకి పాల్పడ్డారు. సాంకేతిక పరిజ్ఞానంతో అత్యంత చాకచక్యంగా ఈ దోపిడీకి పాల్పడ్డ ముఠాను గుర్తించడంలో క్రైమ్ పోలీసులు చేసిన కృషి ప్రశంసనీయం. అదనపు ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్ నేతృత్వంలో అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్, పట్టణ సీఐ పి.వీరబాబు, మరో సీఐ ప్రశాంత్‌కుమార్, రూరల్ ఎస్ఐ వై.శేఖర్‌బాబుతోపాటు మరికొందరు పోలీసులను మూడు బృందాలుగా ఏర్పాటు చేసి నెలరోజుల వ్యవధిలోనే కిమ్స్ దోపిడీ కేసును ఛేదించి సొత్తు రికవరీ చేశారు. నిందితుల నుంచి 868 గ్రాముల బంగారం, 8.56 కిలోల వెండి, హ్యుండాయ్ వెర్నా కారు, నాలుగు మొబైళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ తెలిపారు. ఈ ముఠా సభ్యులు శ్రీకాకుళం జిల్లాలో 37, విశాఖపట్నం సిటీలో ఒకటి, ప్రకాశం జిల్లాలో ఒకటి, గుంటూరు జిల్లాలో ఒకటి, తెలంగాణాలోని మెదక్ జిల్లాలో ఒకటి దొంగతనాలు, దోపిడీలకు పాల్పడినట్టు ఎస్పీ కృష్ణారావు చెప్పారు. అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను పట్టుకోవడంలో కీలక పాత్ర వహించిన సీఐలు వీరబాబు, డి.ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ శేఖర్‌బాబు, ఏఎస్ఐ అయితాబత్తుల బాలకృష్ణ, క్రైమ్ పార్టీ సభ్యులను ఎస్పీ కృష్ణారావు ప్రత్యేకంగా అభినందించారు. వీరందరికీ క్యాష్ రివార్డులను ఎస్పీ అందించారు. చాకచక్యంగా నెలరోజుల వ్యవధిలోనే భారీ దోపిడీ కేసులను ఛేదించిన పోలీసులను ప్రజలు అభినందిస్తున్నారు.

నవోదయలో 9, 11 తరగతుల్లో
ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పెద్దాపురం, అక్టోబరు 1: స్థానిక జవహర్ నవోదయాలో 2025-26 విద్యా సంవత్సరంలో 9, 11 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ప్రస్తుత విద్యాసంవత్సరంలో 8వ తరగతి చదువుతూ 1.5.2010 నుంచి 31.7.12 తేదీల మధ్య జన్మించి ఉండాలన్నారు. 11వ తరగతిలో ప్రవేశం పొందే అభ్యర్థులు ప్రస్తుత విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదువుతూ 1.6.2008 నుంచి 31.7.2010 మధ్య జన్మించి ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదివి ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 30న చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 8వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు.

ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలకు
స్పాట్ కౌన్సెలింగ్

- నన్నయ వీసీ శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, అక్టోబరు1 : ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించిన ఏంబీఏ, ఎంబీఏ (టూరిజం అండ్ హాస్పిటాలిటీ), ఎంసీఏ కోర్సుల్లోని భర్తీ కాని సీట్లకు ఈనెల 5న స్పాట్ కౌన్సెలింగ్ జరుగుతుందని వీసీ వై.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఏపీఐసెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం ఇక్కడి ప్రాంగణంతోపాటు తాడేపల్లిగూడెం, కాకినాడ క్యాంపస్‌లలో సంబంధిత సీట్లు భర్తీకి కౌన్సెలింగ్ జరుగుతుందని తెలిపారు. విశ్వవిద్యాలయంలోని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు ఉదయం 9-30నుంచి 11గంటలలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. కౌన్సెలింగ్ ప్రక్రియను డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డి.జ్యోతిర్మయి పర్యవేక్షిస్తారని చెప్పారు. సీట్లు, ఫీజు వివరాలను విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చునని తెలిపారు.

90వ సారి రక్తదానం



రక్తదానం చేస్తున్న పోలిశెట్టి తాతీలు

కరప, అక్టోబరు 1: జాతీయ రక్తదాతల దినోత్సవం సందర్భంగా కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు 90వ సారి రక్తదానం చేశారు. కాకినాడ అభయ బ్లడ్ బ్యాంక్‌లో మంగళవారం రక్తదానం చేసినట్టు ఆయన తెలిపారు. మెగాస్టార్ చిరంజీవి స్ఫూర్తితో గత 30ఏళ్లగా మిత్రులతో కలిసి రక్తదానం చేస్తున్నట్టు వివరించారు. అలాగే కరప గ్రామానికి చెందిన దేవు మాణిక్యాలరావు(మిఠాయికొట్టు బాబీ) తన కుమార్తె మణిఐశ్వర్యదేవి పుట్టినరోజు సందర్భంగా 19వ సారి రక్తదానం చేశారు.

వినాయక నిమజ్జన ఊరేగింపు దాడిలో
21 మందికి రిమాండ్

కొవ్వూరు, అక్టోబరు 1 : కొవ్వూరు పట్టణంలో వినాయకుడి నిమజ్జన ఊరేగింపులో శ్రీరామకాలనీ, రాజీవ్‌కాలనీవాసుల మధ్య దాడికి కారణమైన 21 మందిని అరెస్టుచేసి రిమాండ్ నిమిత్తం జైలుకు పంపించినట్లు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. కొవ్వూరు పట్టణంలోని రాజీవ్‌కాలనీకి చెందిన వినాయకుడి విగ్రహం నిమజ్జన ఊరేగింపులో శ్రీరామకాలనీ వద్ద జరిగిన రాళ్ల దాడికి సంబంధించి ఇరువర్గాలకు మొదటి దఫాగా కొంతమందిని పోలీసులు అరెస్టు చేశారు. సెప్టెంబర్ 30న కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ శ్రీరామకాలనీ వాసులపై జరిగిన దాడికి సంబంధించి నమోదుచేసిన ఎస్సీ, ఎస్టీ కేసులో రాజీవ్‌కాలనీకి చెందిన 15 మందిని అరెస్టు చేశారు. అదేవిధంగా రాజీవ్‌కాలనీవాసులు అందించిన ఫిర్యాదుమేరకు నమోదు చేసిన కేసులో ఆరుగురిని అరెస్టు చేశారు. మొత్తం 21 మందిని మంగళవారం కొవ్వూరు 2వ అదనపు జ్యూడీషియర్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించడంతో 21 మందిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించామన్నారు. శ్రీరామకాలనీ, రాజీవ్‌కాలనీలలో శాంతియుత వాతావరణం నెలకొనే వరకు పికెటింగ్‌లు కొనసాగిస్తున్నట్లు సీఐ విశ్వం తెలిపారు. ఈ కేసులకు సంబంధించి దర్యాప్తు కొనసాగుతుందని, విచారణ అనంతరం మరికొంత మందిని అరెస్టు చేసే అవకాశం ఉందన్నారు.

విధుల్లో చేరిన మునిసిపల్ డీఈఈ

- సస్పెన్షన్ ఉత్తర్వులు రద్దు చేసిన హైకోర్టు



కమిషనర్‌కు జాయినింగ్ రిపోర్టు ఇస్తున్న డీఈఈ భవానీశంకర్

పిఠాపురం, అక్టోబరు 1: కాకినాడజిల్లా పిఠాపురం పురపాలక సంఘ కార్యాలయంలో డీఈఈగా పనిచేస్తున్న భవానీశంకర్ హైకోర్టు ఉత్తర్వులతో మంగళవారం తిరిగి విధుల్లోకి చేరారు. ఆగస్టు 31వ తేదీన జరిగిన పిఠాపురం మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిల్‌సభ్యులు సాక్షిగా కమిషనరు కనకారావు, డీఈ ఈ భవానీశంకర్‌లు పరస్పరం వాగ్వివాదం, తోపులాట, బాహాబాహికి దిగారు. దీనిపై అప్పట్లో ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. జిల్లా కలెక్టరు నివేదిక ఆధారంగా డీఈఈ భవానీశంకర్‌ను అదేరోజు రాత్రి సస్పెండ్ చేస్తూ పబ్లిక్‌హెల్త్ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై భవానీశంకర్ హైకోర్టును ఆశ్రయించారు. తన వివరణ తీసుకోకుండా అన్యాయంగా సస్పెండ్ చేశారని హైకోర్టుకు విన్నవించారు. దీనిపై స్పందించిన హైకోర్టు ఇంజనీర్ ఇన్ చీఫ్ జారీచేసిన ఉత్తర్వులను పక్కన పెడుతూ ఉత్తర్వులు ఇచ్చింది. హైకోర్టు ఆదేశాలతో డీఈఈ భవానీశంకర్ విధుల్లో చేరుతూ కమిషనర్ కనకారావుకు జాయినింగ్ రిపోర్టును అందజేశారు. అనంతరం డీఈఈగా బాధ్యతలు స్వీకరించారు. హైకోర్టు ఉత్తర్వులతో డీఈఈ విధుల్లో చేరారని కమిషనర్ ధ్రువీకరించారు.

గాంధీ జయంతి రోజున పాఠశాలలు పనిచేయాలని విద్యాశాఖ ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి

- ఏపీటీఎఫ్ డిమాండ్

కొవ్వూరు, అక్టోబరు 1 : అక్టోబరు 2వ తేదీ గాంధీ జయంతిని పురస్కరించుకుని తూర్పుగోదావరి జిల్లాలోని అన్ని పాఠశాలలు పనిచేయాలని ఇచ్చిన ఉత్తర్వులపై ఏపీటీఎఫ్ తీవ్ర అభ్యతరం తెలిపింది. ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దసరా పండుగను అక్టోబరు 3వ తేదీ నుంచి పాఠశాలలకు సెలవులు ప్రకటిస్తుందని 10 రోజుల ముందునుంచే వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో అక్టోబరు 2న గాంధీ జయంతి సెలవు కూడా కలిసి వస్తోందని భావించి ఎంతోమంది ఉపాధ్యాయులు, ప్రయాణాలు, కార్యక్రమాలు పెట్టుకున్నారు. అకస్మాత్తుగా విద్యాశాఖ అధికారులు రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడాలేని విధంగా ఒక్క తూర్పుగోదావరి జిల్లాలోనే గాంధీ జయంతి రోజున అన్ని పాఠశాలలు పనిచేయాలని ఉత్తర్వులు విడుదల చేయడాన్ని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.దుర్గారావు, పి. సువర్ణరాజులు అభ్యంతరం తెలిపారు. తక్షణం విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

పట్టా భూముల్లోనూ ఇసుక తీతలు



గాయత్రీ ర్యాంపులో బోట్స్‌మన్ సొసైటీ సభ్యులతో జేసీ చినరాముడు

- ఓపెన్ ర్యాంపులకు టెండర్లు పిలిచే యోచన
- మొక్కుబడిగా మొదలైన ఇసుకతీత
- ఇంకా అయోమయంలోనే బోట్స్‌మెన్ సొసైటీలు
- గాయత్రీ రెండు ర్యాంపులకు కొలతలు
- అనుమతి మేరకు ఇసుక తీయాలి: జేసీ చినరాముడు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి):

ఇక ఇసుక కొరత కొద్దిరోజులు మాత్రమే. పట్టా భూముల్లో కూడా ఇసుక తీతకు అనుమతిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. దీంతో గోదావరి లంకల్లోని పట్టా భూముల్లో ఇసుక కూడా తీసి ఉచిత ఇసుక విధానంలో సరఫరా చేయవచ్చు. బహుశా ఈనెల 15 తర్వాత ఓపెన్ ర్యాంపులు కూడా అమల్లోకి వచ్చే అవకాశముంది. ప్రస్తుతం బోట్స్‌మెన్ సొసైటీల ద్వారా డీసిల్టేషన్ కూడా మొదలవుతోంది. ఇవన్నీ మొదలైతే జిల్లాలో ఇసుక కొరత అనేదే ఉండదు. ఇతర ప్రాంతాలకు కూడా సరఫరా చేసే అవకాశం ఉంది. కానీ ప్రస్తుతం డీసిల్టేషన్ పాయింట్లలో ఇసుక తీత ఇంకా అయోమయంలోనే ఉంది. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చినరాముడు ఆధ్వర్యంలో ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, మైన్స్ ఏడీ డి.ఫణిభూషణ్, ఇరిగేషన్ హెడ్‌వర్క్స్ ఈఈ ఆర్.కాశీవిశేశ్వరరావు, మైన్స్ ఏజీ విఘ్నేష్, అర్బన్ తహశీల్దార్ పీహెచ్ పాపారావు, డీఈఈలు, గాయత్రీ ర్యాంపులను పరిశీలించారు. బోట్స్‌మెన్ సొసైటీ సభ్యులతో మాట్లాడారు. ఇసుకతీత వెంటనే ప్రారంభించాల్సిన అవసరాన్ని వివరించారు. గాయంత్రీ 1, 3 ర్యాంపులను ఒక ర్యాంపుగానూ, 2, 4 ర్యాంపులను మరో ర్యాంపుగానూ గుర్తించి కొలతలు వేయించారు. కానీ అక్కడ ఇప్పటికే సుమారు 20 బోట్స్‌మెన్ సొసైటీలకు అనుమతిచ్చారు. కానీ ఏ పాయింట్‌లో ఎవరు ఇసుక పోగుపెట్టాలనేది స్పష్టం చేయలేదు. అధికారుల సూచన మేరకు కొందరు సుమారు 15వేల టన్నుల ఇసుకను తీసి గుట్టపెట్టారు. రేపోమాపో మరికొందరు ఇసుక తీస్తారు. కానీ వీరంతా ఇసుక ఎక్కడ వేయాలనేది కూడా స్పష్టత లేకపోవడంతో అందరూ అయోమయంలో పడ్డారు. వీరికి డబ్బు ఎవరిస్తారనేది కూడా ఇంకా స్పష్టత లేదు. ఈనెల 11వ తేదీ తర్వాత బోట్స్‌మెన్ సొసైటీలన్నింటి ద్వారా ఇసుక తీయించడానికి ఓ ఏజెన్సీ వస్తుందనే ప్రచారం ఉంది. అప్పటివరకూ ఈ ఇసుక తీత ఓ తతంగం మాదిరిగానే ఉండవచ్చనే అంచనా ఉంది. త్వరలో ఓపెన్ ర్యాంపులు కూడా అమలులోకి రానున్నాయి. అవి సుమారు 31 వరకూ ఉండవచ్చు. వాటి నిర్వహణకు టెండర్లు పిలిచే ఆలోచన కూడా ఉన్నట్టు సమాచారం.

అనుమతి మేరకు ఇసుక తీయాలి: జేసీ చినరాముడు

ప్రభుత్వం ఇచ్చిన అనుమతి మేరకు ఇసుక తీత, సరఫరా ఉండాలని జాయింట్ కలెక్టర్ ఎస్.చినరాముడు చెప్పారు. గాయత్రీ ర్యాంపులను పరిశీలించిన ఆయన బోట్స్‌మెన్ సొసైటీ సభ్యులతో మాట్లాడారు. మంగళవారం 15వేల టన్నుల ఇసుక తీసినట్టు బోట్స్‌మెన్ సొసైటీలు చెప్పాయి. ఈ ర్యాంపుల నుంచి రెండు లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉంటుందని అధికారులు జేసీకి తెలిపారు. ప్రతిరోజూ ఇసుక సరఫరా సామర్థ్యాన్ని పెంచాలని జేసీ ఆదేశించారు.

రత్నగిరిపై శరన్నవరాత్రికి సర్వం సిద్ధం

- 12న శమీపూజ. రావణసంహారం కార్యక్రమాలు
- 3 నుంచి 12 వరకు రోజుకొక అలంకారంలో అమ్మవారు

అన్నవరం, అక్టోబరు 1: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో శరన్నవరాత్రి వేడుకలకు అధికారులు సర్వంసిద్ధం చేస్తున్నారు. ఈనెల 3 నుంచి 12 వరకు ఈ వేడుకలు జరుగనుండగా వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లు రోజుకొక అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. ఉదయం నుంచి విశేషపూజలు, సాయంత్రం కుంకుమార్చనలు నిర్వహిస్తారు. చివరిరోజైన 12వ తేదీన రాత్రి 7 గంటలకు శమీపూజ, దేవస్థానం హైస్కూల్ ప్రాంగణంలోను, 8గంటలకు రావణసంహారం కార్యక్రమం దేవస్థానం కళాశాల మైదానంలో చేపట్టనున్నట్లు ఆలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

మన్యంలో మద్యం షాపులన్నీ స్థానిక గిరిజనులకే!

- అన్ని షాపులకూ పీసా గ్రామసభల ఆమోదం తప్పనిసరి
- 40 షాపులకు నోటిఫికేషన్ జారీ చేసిన అల్లూరి కలెక్టర్

రంపచోడవరం, అక్టోబరు1: మన్యంలోని మద్యం షాపులన్నీ స్థానికంగా ఉండే గిరిజనులకే ఇవ్వాలని ప్రభుత్వం నిశ్చయించి 2024-26కు రూపొందించిన మద్యం విధానంలో నిర్దేశించింది. ఈమేరకు రూపొందించిన నిబంధనలలో గిరిజన ప్రాంతాలకు సంబంధించి మా ర్గదర్శకాలను ఖరారు చేసింది. అల్లూరి జిల్లాలోని రంపచోడవరం, చింతూరు, పాడేరు డివిజన్లలో మొత్తంగా 40మద్యం షాపులకు మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఆమోదంతో గెజిట్ నోటిఫికేషన్ జారీ అయింది. ప్రభుత్వం మద్యం విధానాన్ని రూపొందించడంలోనే గిరిజన ప్రాంతాలకు సంబంధించి అనుసరించాల్సిన మార్గదర్శకాలను గిరిజన ప్రాంతాల చట్టాలను దృష్టిలో ఉంచుకుని ఖరారు చేసింది.

పీసా నిబంధనల ప్రకారం కేటాయింపు

గిరిజన ప్రాంతాలకు కేటాయించిన షాపులన్నిటికీ గిరిజన ప్రాంతాల పంచాయతీరాజ్ చట్టం(పీసా) నిబంధనల ప్రకారం ఆయా గ్రామసభల నుంచి షాపుల ఏర్పాటుకు ఆమోదాలను తీసుకోవాల్సి ఉంటుంది. గ్రామసభల నుంచి నాలుగు వారాలలో ఆమోదం లభించని పక్షంలో, నాలుగువారాల అనంతరం దానిని ఆమోదం లభించినట్టుగానే భావించాల్సి ఉంటుందని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఇక్కడ షాపులన్నీ స్థానికంగా ఉండే గిరిజనులకే కేటాయించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

షాపుల వివరాలు

రంపచోడవరం డివిజన్లో రంపచోడవరంలో రెండు, దేవీపట్నంలో ఒకటి, వై.రామవరంలో ఒకటి, అడ్డతీగలలో రెండు, గంగవరంలో ఒకటి, మారేడుమిల్లిలో ఒకటి, రాజవొమ్మంగిలో రెండు, చింతూరులో మూడు, ఎటపాకలో రెండు, కూనవరంలో ఒకటి, వి.ఆర్.పురంలో రెండు చొప్పున మద్యం షాపులను కేటాయిస్తూ కలెక్టరు నోటిఫై చేశారు. రంపచోడవరం ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టరు పరిధిలోని షాపులకు రంపచోడవరంలోనూ, చింతూరు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టరు పరిధిలోని షాపులకు చింతూరు లోనూ దరఖాస్తులను దాఖలు చేసుకోవచ్చు. ఈనెల 11న పాడేరులోని ఎస్పీ కార్యాలయం సమీపంలోని వి.ఆర్.ఫంక్షన్ హాల్‌లో లాటరీ పద్ధతిన అన్నిషాపులకు లైసెన్సులను మంజూరు చేస్తారు.



హైవేల మీద, గుడి, బడి పక్కనా
మద్యం షాపులు ఉండొద్దు

- మద్యం విధాన నిబంధనల్లో రాజీపడని కూటమి ప్రభుత్వం

జాతీయ రహదారులపైనా, రాష్ట్ర హైవేలపైనా, గుడిపక్కనా, బడిపక్కనా మద్యం షాపులు ఉండొద్దని కూటమి ప్రభుత్వం తేల్చిచెప్పింది. 2024-26 మద్యం విధానంలో ఎక్కడా కూడా హైవేలపైనా, గుడులు, బడులపైనా ఎక్కడా మద్యం షాపులు ఉండ కుండా నిర్దిష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. హైవేల ను ఆనుకుని కనుచూపు మేరలో ఎక్కడా కూడా మద్యం షాపులు ఉండొద్దని, జాతీయ రహదారి, స్టేట్ హైవేను ఆనుకుని 500 మీటర్ల పైబడిన ప్రాంతంలోనే ఈ షాపులను నెలకొల్పాలి. ఈ విధంగా మన్యం మీదుగా రాజమహేంద్రవరం నుంచి అరకు జాతీయ రహదారి పైనా, భద్రాచలం హైవేపైనా ఎక్కడా షాపులకు అవకాశం లేదు. 500 మీటర్ల లోపలకు షాపులను నెలకొల్పుకోవచ్చు. గుడులు, బడులు ఉన్నచోట 100 మీటర్ల పైబడి ఎక్కడా షాపులు ఉండరాదని నిబంధనల్లో పేర్కొంది.

దారి దోపిడీకి పాల్పడిన ఏడుగురి అరెస్టు

- రూ.1.70 లక్షల నగదు, రెండు బైక్‌లు స్వాధీనం

నరసాపురం, అక్టోబరు 1: మండలంలోని సీతారాంపురం టోల్ ప్లాజా సమీపంలో సోమవారంరాత్రి ఓ చిరు వ్యాపారిని కొట్టి రూ.2లక్షలు దోపిడీకి పాల్పడిన కేసు మిస్టరీని పోలీసులు కొద్ది గంటలోనే ఛేధించారు. తోటి వ్యాపారిని ఆర్ధికంగా దెబ్బతీయాలన్న అక్కసుతోనే ఇదే వ్యాపారం చేస్తున్న మరో ఇద్దరు ఐదుగురు కిరాయి వ్యక్తులతో ఈ దోపిడీకి పాల్పడినట్లు అదనపు ఎస్పీ మురళీకృష్ణ చెప్పారు. మంగళవారం సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి గ్రామానికి చెందిన రాపాక చంద్రరావు విదేశీ వస్తువుల విక్రయిస్తుటాడు. దీంతో పాటు విదేశాల నుంచి వచ్చిన వారి నుంచి కరెన్సీ కొనుగోలుచేసి వాటిని వెస్ట్రన్‌మనీ సెంటర్లలో అమ్ముతుంటాడు. ఇదే ప్రాంతానికి చెందిన మేడిద వెంకటరెడ్డి, మానిక్యబాబులు కూడా ఇదే వ్యాపారం చేస్తుంటారు. అయితే చంద్రరావు వ్యాపారం స్పీడ్‌గా ఉండడంతో అతన్ని ఆర్ధికంగా దెబ్బతీయాలని ఇద్దరు స్కెచ్ వేశారు. కోనసీమ జిల్లా రాజోలు ప్రాంతానికి చెందిన ఆకుల ప్రభుతేజ, సాధనాల మణికంఠ, భయ్యా హేమసాగర్, కోరుకొండ గిరిబాబు, గంటారాజు, మలికిబాబులను పురమాయించి రెండు లక్షలు విలువైన విదేశీ కరెన్సీ నోట్లు ఉన్నాయంటూ చంద్రరావుకు ఫోన్ చేయించారు. సీతారంపురం సమీపంలోని రాజుగారితోట టోల్ ప్లాజా వద్దకు వస్తే అందజేస్తామని నమ్మించారు. ఇది నిజమని భావించిన చంద్రరావు డబ్బుతో అక్కడికి చేరుకున్నాడు. అప్పటికే అక్కడ మాటు వేసిన కిరాయి వ్యక్తులు అయిగురు చంద్రరావుపై దాడి చేశారు. తెచ్చిన నగదు రూ.2 లక్షలు దోచుకుపోయారు. వెంటనే తేరుకున్న చంద్రరావు మొగల్తూరు పోలీసుల్ని అశ్రయించడంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టగా, వెంకటరెడ్డిపై అనుమానం వచ్చిందన్నారు. లోతైన విచారణ చేయగా మొత్తం కేసు మిస్టరీ వీడిందన్నారు. మంగళవారం ఉదయం నింధితులంతా పట్టణంలోని ఓ లాడ్జీలో ఉన్నట్లు గుర్తించి అరెస్టు చేశామన్నారు. వారి నుంచి రూ.1.75 లక్షల నగదు,రెండు బైక్‌లు, పది విదేశీ కరెన్సీనోట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎమావేశంలో సీఐలు యాదగిరి, ప్రసాద్, ఎస్సై వాసులు పాల్గొన్నారు.

వృద్ధురాలిని బండి ఎక్కించుకుని.. పింఛన్ సొమ్ము లాక్కొని..
పరారైన అగంతుకుడు

- గాయపడిన వృద్ధురాలు



గాయపడ్డ వృద్ధురాలికి తిరిగి పింఛన్ అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

పిఠాపురం, అక్టోబరు 1: వృద్ధురాలిని గాయపరిచి పింఛన్ సొమ్ము లాక్కొని అగంతకుడు పరారయ్యాడు. ఈ సంఘటన కాకినాడ జిల్లా పిఠాపురంలోని జగ్గయ్యచెరువుకాలనీలో మంగళవారం జరిగింది. గొల్లపేటకు చెందిన గోపాలపు అనంతలక్ష్మి కాలనీలోని 11వ వార్డు సచివాలయం పింఛన్ తీసుకునేందుకు వచ్చింది. సిబ్బంది ఇచ్చిన రూ.4వేలును తీసుకుని బయటకు రాగానే ఒక అగంతకుడు వచ్చి మీ ఇంటివైపే వెళుతున్నాను దిగబెడతాను అని మోటార్‌సైకిల్ ఎక్కించుకున్నాడు. ఇంటి దగ్గర దింపకుండా మండలపరిషత్ కార్యాలయం సమీపం రోడ్డులోకి తీసుకువెళుతుండటంతో వృద్ధురాలు ప్రశ్నించింది. దీంతో వృద్ధురాలిని మోటార్‌సైకిల్‌పై నుంచి తోసేసి ఆమె వద్ద ఉన్న రూ.4వేలను తీసుకుని అగంతకుడు పరారయ్యాడు. కిందపడిపోయిన వృద్ధురాలికి ముఖంపై గాయాలయ్యాయి. వెనుక స్కూటీపై వస్తున్న వ్యక్తి సదరు అగంతకుడిని పట్టుకునేందుకు ప్రయత్నించినా దొరకలేదు. దీంతో వృద్ధురాలు అక్కడే కూర్చుండిపోయింది. స్థానికులు ఆమె కు సపర్యలు చేశారు. సీసీ కెమేరా దృశ్యాలు ఆధారంగా పట్టణ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న మునిసిపల్ కమిషనర్ కనకారావు తన స్వంత సొమ్ము రూ.4వేలను సచివాలయ సిబ్బంది ద్వారా ఆ వృద్ధురాలికి అందజేశారు.

రేపటి నుంచి దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు

- పంచారామంలో ఏర్పాట్లు పూర్తి

సామర్లకోట, అక్టోబరు 1: పంచారామ పుణ్యక్షేత్రమైన సామ ర్లకోట కుమార రామభీమేశ్వరాలయంలో ఉన్న బాలాత్రిపుర సుందరి అమ్మవారి దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు మూడో తేదీ గురువారం నుంచి 12 తేదీ వరకూ నిర్వహించనున్నారు. ఆలయంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు చేయడమేగాక జిల్లా, రాష్ట్రం నలుమూలల నుంచీ ఆలయానికి వచ్చే భక్తులకు నిత్యాన్నదాన పథకం ద్వారా అన్నప్రసాదాలను అందించేందుకు ఏర్పాట్లూ పూర్తిచేశారు. 3న గురువారం ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనము, ఆచార్యులు, రక్షాబంధనము, కలశస్థాపన నిర్వహించనున్నారు. నవరాత్రి జరుగు తొమ్మిదిరోజులూ ఉదయం 8 గంటల నుంచి దుర్గాసప్తశతిపారాయణ, బాలాపరమేశ్వరీ మంత్రజపములు నిర్వహిస్తారు.

మాకు న్యాయం చేయాలి

- మద్యం షాపుల కాంట్రాక్ట్ ఉద్యోగుల నిరసన
- మద్యం దుకాణాల మూసివేత
- బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయాలు



అనపర్తిలోని ప్రభుత్వ మద్యం దుకాణం మూసివేసి నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

అనపర్తి, అక్టోబరు 1: ఐదేళ్లుగా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విధులు నిర్వహిస్తున్న తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు మంగళవారం షాపులను మూసివేసి నిరసన తెలిపారు. గతనెల 30వ తేదీతో తమ గడువు ముగిసిందని తమ భవిష్యత్ అంధకారంగా మారిందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. తమ అర్హతను బట్టి మద్యం డిస్పెన్సరీలలోగానీ మరోచోటగాని పని కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈనెల 12 నుంచి ప్రైవేటు షాపులు ప్రారంభం కానున్న నేపథ్యంలో వీరంతా షాపులను మూసివేసి నిరసన తెలుపుతున్నారు. వీరి సమ్మెతో మద్యం దొరకదని గ్రహించిన మందుబాబులు బ్లాక్ మార్కెట్ వైపుకు పరుగులు పెట్టడంతో నిర్వాహకులు మద్యం ధరలు పెంచేశారు. ఫుల్ బాటిల్‌కు రూ.500, క్వార్టర్‌కు రూ.100-150 అదనంగా వసూలు చేస్తున్నారు. సాయంత్రం 7గంటల సమయంలో కాంట్రాక్ట్ ఉద్యోగుల యూనియన్ నుంచి వచ్చిన సమాచారంతో అనపర్తి కెనాల్ రోడ్డులోని షాపును తెరవడంతో మందు బాబులు ఎగబడ్డారు. ఈనెల 5వ తేదీ వరకు వేచి చూడాలని రాష్ట్ర యూనియన్ ఇచ్చిన సమాచారం మేరకు అక్కడక్కడా షాపులు తెరుచుకున్నట్టు సమాచారం.

ఏజెన్సీ సమాచారం

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ



వై.రామవరంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి

వై.రామవరం, అక్టోబరు 1: వై.రామవరం, అడ్డతీగల మండలాల్లో మంగళవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి స్వయంగా చేపట్టారు. రాయపల్లి, దేవరమడుగుల, చవిటిదిబ్బలు, పనసలపాలెం, పి.యర్రగొండ, యార్లగడ్డ తదితర గ్రామాల్లో లబ్ధిదారులకు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఒకేసారి పింఛన్లు పెంచిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదేనన్నారు. అనంతరం స్థానిక సామాజిక ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సౌకర్యాలు పరిశీలించారు. యార్లగడ్డ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న మెనూ పరిశీలించి ప్రభుత్వం అందిస్తున్న ప్రకారం మెనూ సక్రమంగా అందించాలని సూచించారు. టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, నాయకులు రమణారెడ్డి, గొర్లె శ్రీకాంత్, రెడ్డి సత్యనారాయణ, పల్లాల లింగారెడ్డి, స్వామిరెడ్డి పాల్గొన్నారు.

దేవీపట్నం: మండలంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పింఛన్ల పంపిణీ మంగళవారం నిర్వహించారు. మండలంలోని ఇందుకూరు, ఇందుకూరుపేట, చొప్పకొండ, పాముగండి, శరభవరం, దేవారం తదితర గ్రామాల్లో పింఛన్ల పంపిణీ ఆయా కూటమి నాయకుల ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందితో పంపిణీ చేశారు. ఇందుకూరు-1 ఆర్ఆర్‌కాలనీలో మంటూరు, ఏనుగుల గూడెం, అగ్రహారం గ్రామాల వారికి దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగేష్, నాగేశ్వరరావు, హరిశ్చంద్రుడు, పెదసుబ్బారావు, అంజిరెడ్డి, ఇంద్రజ, శ్రీనువాస్ పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఇంటివద్దే పింఛన్లు : కలెక్టర్



మారేడుమిల్లిలో పింఛను పంపిణీ చేస్తున్న కలెక్టరు

మారేడుమిల్లి, అక్టోబరు 1: ఒకటో తేదీనే లబ్ధిదారుల ఇంటివద్దకు వెళ్లి సామాజిక పింఛన్లు పంపిణీ చేస్తామని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరు ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్‌కలెక్టరు కల్పశ్రీతో కలసి దొరవీ ధిలో పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో కూడా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లు అందస్తామన్నారు. అనంతరం ఇటీవల జలతరంగిణిలో మెడికల్ విద్యార్థులు గల్లంతైన ప్రాంతాన్ని పరిశీలించారు. పర్యాటక ప్రాంతాల్లో పూర్తిగా భద్రతా వలయాలు ఏర్పాటుచేసిన తర్వాతే పర్యాటకులను అనుమతించాలని సూచించారు. ఎంపీడీవో వీర కిషోర్, ఎంపీపీ ఎల్.రవి కుమార్, సర్పంచ్ కొండా జాకబ్ పాల్గొన్నారు.

రంపచోడవరం: మంగళవారం లబ్దిదారుల ఇంటింటికి వెళ్లి సచివాలయ సిబ్బందితో కలిసి కూటమి నాయకులు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అడబాల బాపిరాజు, పాటోజు సురేష్, సిద్ధ వెంకన్నదొర, షేక్ ఇబ్రహీం, సాదల సత్య, వై.భూచక్రం పాల్గొన్నారు.

మండలంలో 98 శాతం పింఛన్లు పంపిణీ

వరరామచంద్రాపురం: మండలంలో 98 శాతం పించన్లు పంపిణీ పూర్తిచేశారని జడ్పీటీసీ సభ్యుడు వాళ్ల రంగారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెంది కె.సాయిబాబు గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న అతనికి ఎమ్మెల్యే మిర్యాల శిరీషాదేవి చొరవతో మంజూరు చేసిన పదివేల రూపాయలను గ్రామ సచివాలయ సిబ్బంది సమక్షంలో మండల టీడీపీ నాయకులు బాధితుడికి అందజేశారు. మాజీ జడ్పీ టీసీ ముత్యాల రామారావు, రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ బొర్ర నరేష్‌కుమార్, సీనియర్ నాయకులు బొర్ర నరసింహరావు, బీరక ప్రకాష్‌రావు, పాఠశాల చైర్మన్ ముత్యాల శంకర్, బొర్ర సూరి, సిద్దు, ఆది, అచ్చిరాజు పాల్గొన్నారు.

బాధితులందరికీ వరద పరిహారం

కూనవరం, అక్టోబరు 1: వరద బాధితులందరికీ నష్టపరిహారం అందుతుందని కూనవరం తహసీల్దారు నాగబాబు పేర్కొన్నారు. తమకు వరద పరిహారం అందలేదంటూ కొంతమంది మహిళలు నిరసన తెలిపారు. దీనికి స్పందించిన తహసీల్దారు వరద బాధితుల దగ్గరికి వెళ్లి మాట్లాడారు. ఏ ఒక్కరికీ అన్యాయం జరగదని, పూర్తిస్థాయిలో పరిహారం అందేందుకు తాను కృషిచేస్తానన్నారు. మర్రిగూడెం గ్రామస్తులు తమకు పరిహారం అందలేదని తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. పరిశీలించి న్యాయం చేసేందుకు కృషిచేస్తామన్నారు. ఆర్ఐ సత్యనారాయణ, వీఆర్వో వెంకన్న పాల్గొన్నారు.

డీఏవీ పాఠశాలలో దసరా ముందస్తు వేడుకలు

మోతుగూడెం, అక్టోబరు 1: మోతుగూడెం డీఏవీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు మల్లెల రఘురాం ఆధ్వర్యంలో మంగళవారం దసరా ముందస్తు వేడుకలు నిర్వహించారు. అష్టలక్ష్మి వేషధారణలో విద్యార్థులు అలరించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎల్ ఎన్‌సీ చైర్మన్, సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ పి.వాసుదేవరావు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు మంచి ఫలితాలతో ఉత్తీర్ణత సాధించి భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో నిలవాలని ఆకాంక్షించారు.

బస్సుకింద పడి వ్యక్తి మృతి



మృతిచెందిన మనోజ్

కూనవరం, అక్టోబరు1: బస్సు కింద పడి వ్యక్తి మృతి చెందాడు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మనోజ్ మండల్(48) ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో హైదరాబాద్ నుంచి ఛత్తీస్‌గఢ్ తిరిగి వెళ్తున్నాడు. తెల్లవారితే మంగళవారం అనగా మూత్ర విసర్జన కోసం బస్సు డోరు పక్కన నిలుచున్నాడు. ఈ క్రమంలో కిందకు జారి పడ్డాడు. ఇది గమనించని బస్సు సిబ్బంది, ప్రయాణికులు కొంతదూరం వెళ్లి తమ స్నేహితుడు కనిపించట్లేదని బస్సులో వెదికారు. వెనక్కి వచ్చి చూడగా నర్సింగపేట వద్ద ప్రమాదవశాత్తు బస్సు కింద పడి మృతి చెందినట్టు గుర్తించారు. మృతుడిని కోతులగుట్ట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్వచ్ఛత హీ సేవా కార్యక్రమానికి భాగస్వాములు కావాలి

● కలెక్టరు దినేష్‌కుమార్



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

రంపచోడవరం, అక్టోబరు 1: ఏజెన్సీలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని అల్లూరి సీతారామరాజుజిల్లా కలెక్టరు ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్‌కలెక్టరు కల్పశ్రీతో కలిసి స్థానిక ఐటీడీఏ కార్యాలయం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు నిర్వహించిన స్వభావ్ స్వచ్ఛత, సంస్కార్ ర్యాలీలో పాల్గొన్నారు. కలెక్టరు మాట్లాడుతూ ప్రతివారానికి రెండు గంటలు శ్రమదానంచేసి స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ సంకల్పానికి కృషిచేయాలన్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా పంచాయతీ అధికారి కొండ లరావు, ఏపీవో(జీ) డీఎన్‌వీ రమణ, సర్పంచ్ మంగా బొజ్జయ్య, డీఎల్‌డీవో కోటేశ్వరరావు, డీఎల్‌పీవో అబ్బులు, ఈవోపీఆర్డీ డి.జాన్‌విల్టన్, ఎంపీడీవో హరికృష్ణ పాల్గొన్నారు.

'ఏజెన్సీలో నత్తనడకన అభివృద్ధి పనులు'

రంపచోడవరం, అక్టోబరు 1:ఏజెన్సీలో అభివృద్ధిపనులు నత్తనడకన సాగుతున్నాయని ఏజెన్సీ పర్యటనలో ఉన్న జిల్లా కలెక్టరు ఏఎస్ దినేష్ కుమార్ ను కలిసి వినతిపత్రం సమర్పించినట్టు ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెదుళ్ళ లచ్చిరెడ్డి తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మారేడుమిల్లి-పాతకోట, పందిరిమామిడి-చవిటిదిబ్బలు తదితర రోడ్లలోని బ్రిడ్జీలు కొట్టుకుపోయాని ప్రజలు అత్యవసర సమయాల్లో ఆసుపత్రులకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గంగవరం బాలికల వసతిగృహంలో లైంగిక వేధింపులకు పాల్పడిన ప్రధానోపాధ్యాయుడుపై చర్యలు తీసుకోవాలని, గిరిజనేతరులు ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టినవారిపై చర్యలుతీసుకోవాల ని కలెక్టరును కోరారు.

క్రీడా పోటీల విజేతలకు బహుమతులు

రంగంపేట, అక్టోబరు 1: స్కూల్ గేమ్స్ నియోజకవర్గ స్థాయి పోటీల్లో గెలుపొందిన చంద్రేడు జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు మంగళవారం హెచ్ఎం గంటా రమణబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మెడల్స్, సర్టిఫికెట్లు కూటమి నాయకుడు మద్దిపూడి సత్యనారాయణ అందించారు. అలాగే స్వర్ణాంధ్ర-2047 జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో దొడ్డిగుంట హైస్కూల్ విద్యార్థిని వి.రోహితాధనలక్ష్మీ మూడో స్థానంలో నిలిచిందని హెచ్ఎం కె.రాధారాణి తెలిపారు. అలాగే ఇటీవల కాకినాడలో జరిగిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ పోటీల్లో రంగంపేట హైస్కూల్ టీచర్ బి.లక్ష్మీ చేసిన క్రాఫ్ట్‌కు అవార్డు వచ్చిందని, క్రాఫ్టవర్క్‌లో జి.శిరీష ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు.

వరిలో సేంద్రియ సాగుతో మేలైన దిగుబడులు



రాజానగరం: కానవరంలో రైతులకు సూచనలిస్తున్న మాధవరావు

▸▸ జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

▸▸ పలుచోట్ల పొలం పిలుస్తోంది కార్యక్రమాలు

రాజానగరం/కడియం, అక్టోబరు 1: వరిలో సేంద్రియ ఎరువుల వాడకంతో మేలైన దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు రైతులకు సూచించారు. రాజానగరం మండలం కానవరం, కడియం మండలం కడియపుసావరం గ్రామాల్లో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఆయన విచ్చేసి రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకం తగ్గించి, ప్రకృతి సాగు చేయాలని చెప్పారు. అలాగే ఆకు ఎండు తెగులు సోకిన వరి పొలాల్లో నత్రజని వాడకం తగ్గించి పొటాష్ ఎరువును ఎకరాకు ఎంవోపీ 20 కిలోల చొప్పున ప్రస్తుతం ఉన్న పొట్టదశలో వేయాలని సూచించారు. తెగులు వ్యాప్తిని కొంతవరకు నివారించేందుకు 1గ్రాము ప్లాటోమైసిన్, 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 2గ్రాముల కాపర్ హైడ్రాక్సైడ్, 53.8 డిఎఫ్(కోసైడ్), లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. రైతులకు వ్యవసాయశాఖ 50శాతం రాయితీపై సూక్ష్మపోషకాలను అందిస్తోందని, వ్యవసాయ యాంత్రీకరణ పథకం ఒక్కో రైతుకు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో కానవరం నుంచి ఏవో ఎస్‌కే ఇమామి ఖాసిం, సొసైటీ సీఈవో నల్లమిల్లి దుర్గారావు, కడియపుసావరంలో సర్పంచ్ చెక్కపల్లి మురళి, పాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి, ఏవో ద్వారకాదేవి, ఉద్యానాధికారి సుధీకర్‌కుమార్, ఏఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

రంగంపేట: మండలంలోని కోటపాడు, వెంకటాపురం గ్రామాల్లో వ్యవసాయశాధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అనుబంధ శాఖల అధికారులతో కలిసి వరి పొలాలను పరిశీలించారు. ఆకుఎండు తెగులు, దోమపోటు గుర్తించారు. వాటి నివారణకు చర్యలను రైతులకు వివరించారు.కార్యక్రమంలో గవరసాని మునేష్, కోనే బుజ్జి ఆరుమిల్లి సత్యనారాయణ, బోడెం రామచంద్రరావు, ముంగి తాతారావు, బోడెం రాంబాబు పాల్గొన్నారు.

బిక్కవోలు: బలభద్రపురం, కాపవరంలో జరిగిన కార్యక్రమాల్లో ఏవో నల్లి శామ్యూల్‌జాన్ ఆయన మాట్లాడుతూ రైతులు నూతన యాజమాన్య పద్ధతులు పాటించి తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. కార్యక్రమాల్లో నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి, సర్పంచ్ సత్యశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు లేకుండానే పింఛన్ల పంపిణీ

▸▸ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి.. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల అందజేత



బిక్కవోలు: బలభద్రపురంలో పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

బిక్కవోలు/రంగంపేట, అక్టోబరు 1: గ్రామ వలంటీర్లు లేకుండానే కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 1వ తేదీనే ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం పలుచోట్ల మంగళవారం జరిగింది. బిక్కవోలు మండలం బలభద్రపురం, రంగంపేట మండలం జి.దొంతమూరులో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే నల్లమిల్లి పాల్గొని పలువురికి పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు లేకుండా పింఛన్లు పంపిణీ చేయలేమని వైసీపీ నాయకులు అన్నారని, అయితే నాలుగు నెలలుగా కూటమి నాయకులు, సచివాలయ సిబ్బందితో మొదటిరోజునే 98శాతం పింఛన్ల పంపిణీ జరుగుతుందన్నారు. బిక్కవోలు మండలంలో 10,644 పింఛనుదారుల కోసం ప్రభుత్వం రూ.4,50,55,000 ఖర్చు చేస్తోందన్నారు. కార్యక్రమాల్లో బలభద్రపురంలో నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి, ఇందల వీరబాబు, ఎంపీడీవో జేఏ. ఝాన్సీ పాల్గొనగా ఆరికరేవులలో సర్పంచ్ రెడ్డి నాగవేణికుమారి, పందలపాకలో సర్పంచ్, ఉపసర్పంచ్‌లు సబ్బారపు పద్మావతి, పడాల వెంకటరామారెడ్డి పింఛన్లు పంపిణీ చేశారు.దొంతమూరులో టీడీపీ మండలాధ్యక్షుడు ఎలుగుబంటి సత్తిబాబు, జటప్రోలు వెంకటేశ్వర్లు, గిరజాల సత్తిబాబు, ఎంపీడీవో పి.వెంకటరత్నం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాధాన్య క్రమంలో హామీలు అన్ని అమలు : వాసు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 1: స్థానిక 11వ డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ ప్రాధాన్య క్రమంలో అమలు చేస్తామన్నారు. వివిధ కారణాలతో తొలగించిన పింఛన్లు వారి అర్హత ఆధారంగా తిరిగి పింఛను అందించే ప్రక్రియ త్వరలోనే సీఎం చంద్రబాబు చేపడుతున్నారని చెప్పారు.

చిరస్మరణీయుడు జీఎంసీ బాలయోగి

జయంతిలో ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి, గోరంట్ల



బాలయోగి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే వాసు తదితరులు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 1: దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి నేటికీ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. స్థానిక కంబాలచెరువు పార్కులో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన జీఎంసీ బాలయోగి 73వ జయంతి కార్యక్రమంలో వారు మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ఏపీ అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ యర్రా వేణుగోపాలరాయుడు, కాశి నవీన్‌కుమార్‌లతో కలిసి బాలయోగి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళురర్పించారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ కోటిపల్లి-నరసాపురం రైల్వే లైన్ శాంక్షన్ అయ్యిందని త్వరలో పనులు ప్రారంభమౌతాయని ఇదే బాలయోగి చిరకాలం కోరిక అన్నారు. గోరంట్ల మాట్లాడుతూ రాజకీయాలకు బాలయోగి రోల్ మోడల్‌గా నిలిచారన్నారు. గన్ని కృష్ణ మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో మురికికూపంగా ఉన్న కంబాలచెరువులో బాలయోగి శ్రమదానం చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో టీఎస్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్రే శ్రీనివాసరావు, కుడుపూడి సత్తిబాబు, రెడ్డి మణి, టి.బాబి, కోసూరి చండిప్రియ, కప్పల వెలుగు, తలారి ఉమాదేవి, కూరాకుల తులసి, రాచపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

▸▸ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి దయానిధి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దయానిధి తదితరులు

దివాన్‌చెరువు, అక్టోబరు 1: మూఢనమ్మకాలను విడనాడి శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సీహెచ్ దయానిధి అన్నారు. మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను మంగళవారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు విడివిడిగా నిర్వహించారు. దీనిలో ప్రథమ స్థానం పాతతుంగపాడు జడ్పీ హైస్కూల్, ద్వితీయస్థానం రాజానగరం జడ్పీ హైస్కూల్, తృతీయస్థానం తోకాడ జడ్పీ హైస్కూల్ విద్యార్థులు గెల్చుకున్నారని ఆయన తెలిపారు. చెకుముకి మండల కన్వీనర్ ఏ.సుధారాణి మాట్లాడుతూ మండల స్థాయిలో గెలుపొందిన వారు ఈ నెల 27న జరిగే జిల్లాస్థాయి టెస్ట్‌కు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండలాధ్యక్షుడు ఎం.శ్రీనుబాబు, నాయకులు ఎల్.సుబ్బారావు, కె.భీమయ్య, శిరోమణి, హరీష్, ఇమ్మానియేల్ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం అర్బన్: రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి ఒక ప్రైవేట్ స్కూల్లో చెకుముకి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక జిల్లా కన్వీనర్ రవిబాబు మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి జేవీవీ కృషి చేస్తోందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

కడియం: కడియం ఉన్నత పాఠశాలలో జరిగిన చెకుముకి పరీక్షలో వేమగిరితోట జడ్పీ హైస్కూల్, కడియం షిర్డిసాయి విద్యానికేతన్ విద్యార్థులు మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం టి.సత్యనారాయణ, జేవీవీ కార్యదర్శి వై.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెదుళ్లపల్లి పీఏసీఎస్‌లో రూ.56 లక్షలు మాయం

రికార్డుల తనిఖీలో బయటపడిన గోల్‌మాల్

సీతానగరం, అక్టోబరు 1: మండలంలోని వెదుళ్లపల్లి పీఏసీఎస్‌లో రైతులు తీసుకుని తిరిగి చెల్లించిన రుణాల నగదులో రూ.56 లక్షలు గల్లంతయ్యాయి. రుణాలు ఇచ్చే సమయంలో షేర్ కాపిటల్ నుంచి నగదు మాయమైంది. రికార్డులు తనిఖీలో బయటపడిన ఈ వ్యవహారాన్ని ఇంతవరకు అధికారులు గోప్యంగా ఉంచారు. వెదుళ్లపల్లి సొసైటీలో సుమారు 12 మంది రైతులు కట్టిన లోన్ రికవరీ సొమ్ములు, 25 మంది రైతులకు చెందిన షేర్ క్యాపిటల్ నగదు కలిపి రూ.56 లక్షలు గల్లంతైనట్టు రెండు నెలల క్రితం రఘుదేవపురం బ్రాంచి అధికారులు రికార్డులు తనిఖీలో వెలుగు చూసింది. ఈ విషయాన్ని జిల్లా స్థాయి అధికారులు దృష్టిలో ఉంచడంతో నగదు చెల్లించాలని ఒత్తిడి చేయగా సొసైటీ సీఈవో సురేంద్ర రూ.16 లక్షలు చెల్లించినట్టు సమాచారం. దీనిపై రఘుదేవపురం డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ క్రాంతికృష్ణను వివరణ కోరగా బ్యాంక్‌లో రూ.56 లక్షలు గల్లంతైన మాట వాస్తవమని, రికార్డుల తనిఖీలో బయటపడిందన్నారు. దీనిని ఉన్నతాధికారుల దృష్టిలో ఉంచామని, రికవరీ టీమ్‌ను వేసే అవకాశం ఉందని ఆయన చెప్పారు.

నిడిగట్ల ఎస్సీల చెరువులో విషం కలిపిన వారిపై చర్యలు తీసుకోవాలి

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 1: కోరుకొండ మండలం నిడిగట్ల గ్రామంలో ఎస్సీలకు చెందిన ఫిషర్‌మెన్ సొసైటీ చెరువులో విషం కలిపి లక్షల చేపల మృతి చెంది నష్టపోవడానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్వతంత్ర జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బర్రే ఆనంద్‌కుమార్ డిమాండ్ చేశారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఎస్సీ ఫిషర్‌మెన్ సొసైటీ సభ్యులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. గ్రామంలో పెద్దచెరువులో కొందరు చేపలు దొంగతనం చేశారని దీనిపై ఎస్సీ ఫిషర్‌మెన్ సొసైటీ సభ్యులు వారిని పట్టుకుని గొడవ పడ్డారని, పూర్తి ఆధారాలతో పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టినట్టు చెప్పారు. అయితే కక్షగట్టిన వారు ఊరచెరువులో గత నెల 21న విషం కలిపి చేపలను చంపేశారని, దీని వల్ల రూ.15 లక్షలు పైబడి నష్టం వాటిల్లిందన్నారు. అయితే నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరుతుంటే వారిని స్థానిక ఎమ్మెల్యే రక్షించడం దారుణమని ఆనంద్‌కుమార్ అన్నారు. సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు గొంతి లక్ష్మణ్, కొల్లాటి అబ్బులు, యాళ్ళ ఆత్మారావు, వారా పేదశేషు, యడ్ల రాజేష్, కొత్తపల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రాలో రూ.30 లక్షలు గోల్‌మాల్

కడియపులంక యానిమేటర్ నిర్వాకం

కడియం, అక్టోబరు 1: కడియపులంకలో డ్వాక్రా సంఘాల బ్యాంకు రుణాల చెల్లింపులో లక్షలాది రూపాయలు అవకతవకలు జరిగాయని మహిళాసంఘాల సభ్యులు తెలిపారు. గ్రామంలో మహిళా సంఘాల సభ్యులతో సర్పంచ్-ఇన్‌చార్జి పాటంశెట్టి రాంజీ మంగళవారం కలిసి నిర్వహించిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. కడియపులంకలో సుమారు 6వేల మంది సభ్యులతో సుమారు 500 సంఘాలున్నాయన్నారు. మూడు సంఘాలకు సంబంధించి సుమారు రూ.30 లక్షల మేర యానిమేటర్ గోల్‌మాల్ చేశారన్నారు. కొన్ని డ్వాక్రా సంఘాలు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు కొన్ని నెలలుగా జమ చేయకపోయినా బ్యాంకు అధికారులు స్పందించలేదన్నారు. ఈ మేరకు మహిళాసంఘ సభ్యులతో కలిసి గత నెల 5న డీఆర్‌డీఏ పీడీకి ఫిర్యాదు చేశామన్నారు. అయినప్పటికీ చర్యలు శూన్యమన్నారు. కడియపులంక, బుర్రిలంక, వెంకయ్యమ్మపేటతో పాటు గ్రామాల్లో ఉన్న డ్వాక్రా గ్రూపులను పరిశీలిస్తే మరిన్ని అవకతవకలు బయట పడతాయని రాంజీ తెలిపారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ స్పందించి దర్యాప్తు చేయించాలని కోరారు. కార్యక్రమంలో బోడపాటి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగపట్నంలో ముదిరిన ఫ్లెక్సీ వివాదం

ఇరువర్గాలపై కేసు నమోదు : సీఐ

కోరుకొండ, అక్టోబరు 1: శ్రీరంగపట్నంలో వైసీపీ, కూటమి వర్గాల మధ్య జరిగిన ఫ్లెక్సీ వివాదం చినికిచినికి గాలివానలా మారింది. సీఐ సత్యకిషోర్, ఎస్ఐ శ్యామసుందర్ నచ్చజెప్పినా రాజీకి రాకపోవడంతో ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు పరస్పర కేసులు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. వైసీపీకి చెందిన ఫ్లెక్సీ బోర్డుపై ఎమ్మెల్యే బలరామకృష్ణకు అభినందనలు తెలియజేస్తూ కూటమి నాయకులు ఫ్లెక్సీ పెట్టారు. దీనిని తొలగించాలని వైసీపీ నాయకులు చెప్పగా నాలుగు రోజుల్లో తీసేస్తామని చెప్పారు. అయితే 3నెలలు కావస్తున్నా ఆ ఫ్లెక్సీ తొలగించకపోవడంతో వైసీపీ నాయకులు దాన్ని తొలగించడానికి ప్రయత్నించడంతో వివాదం మొదలైంది. దీనిపై పోలీసులు నచ్చజెప్పినా సమస్య పరిష్కారానికి సహకరించకపోవడంతో రెండు వర్గాలపైన కేసులు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. కాగా శ్రీరంగపట్నంలో రెండు వర్గాలకు మధ్య వివాదానికి కారణమైన ఫ్లెక్సీ, ఫ్రేమ్‌లను పంచాయతీ సిబ్బంది తొలగించినట్టు ఎంపీడీవో నరేష్‌కుమార్ తెలిపారు.

నేడు జీఎస్ఎల్‌కు ఎంపీ పురందేశ్వరి రాక

రాజానగరం/రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 1: రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలకు రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి రానున్నట్టు జీఎస్ఎల్ సంస్థల ఫౌండర్, చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు మంగళవారం తెలిపారు. బుధవారం ఉదయం 11గంటలకు జీఎస్ఎల్ జనరల్ ఆసుపత్రిలో నూతనంగా నిర్మించిన క్రిటికల్ కేర్ అండ్ జనరల్ వార్డులను ప్రారంభిస్తారు. అలాగే మరో ముఖ్యఅతిథి రాజ్యసభ సభ్యుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు డిజిటల్ లేప్రో స్కోపిక్ సర్జికల్ యూనిట్‌ను ప్రారంభిస్తారు. అనంతరం శుశ్రుత ఆడిటోరియంలో సభ జరుగుతుందని చెప్పారు. ఇదిలా ఉండగా ఎంపీ పురందేశ్వరి బుధవారం ఉదయం ద్వారకా తిరుమలలో స్వామి వారిని దర్శించుకున్న అనంతరం గోపాలపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుతో కలసి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 3గంటలకు కోటిపల్లి బస్టాండులో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొంటారు. 4గంటలకు బొమ్మూరులోని శ్రీ వివేకానంద మహారోగి ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించి అక్కడున్న కుష్ఠు వ్యాధిగ్రస్తుల యోగక్షేమాలు తెలుసుకుంటారు. కేంద్రంలో అమలవుతున్న కార్యక్రమాలు, వివిధ ప్రాజెక్టులు పరిశీలిస్తారని ఎంపీ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక

రంగంపేట/అనపర్తి, అక్టోబరు 1: తమ విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారని రంగంపేట జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారధి మంగళవారం తెలిపారు. కాకినాడ డీఎస్ఏ గ్రౌండ్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-14 బాలుర కబడ్డీ పోటీల్లో జి.ఆదినారాయణ, డి.దుర్గాప్రసాద్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్టు చెప్పారు. అలాగే వాలీబాల్ పోటీల్లో జి.దొంతమూరు హైస్కూల్ విద్యార్థి చంద్రమళ్ల సిద్దు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు కేవీ రమణారావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, పీడీలు శైల, ఈ.లక్ష్మీ, పీఈటీ చినబూరిబాబులను ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు అభినందించారు. అలాగే జిల్లా స్థాయి టెన్నీక్వాయిట్ పోటీల్లో బి.అంకిత, టి.వినీల, స్విమ్మింగ్‌లో పి.సంజన, పి.హర్షిత, అండర్-19 క్రికెట్‌లో పి.సిరి, కె.సమీతారాణి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని అనపర్తి జడ్పీ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కర్రి కళ్యాణి తెలిపారు. విద్యార్థినులను, పీఈటీ రాజేశ్వరిని హెచ్ఎంతోపాటు ఎస్ఎంసీ చైర్ పర్సన్ నల్లమిల్లి విజయలక్ష్మీ, ఉపాధ్యాయులు అభినందించారు.

కార్యదీక్షతో ఏదైనా సాధించవచ్చు

రాజానగరం, అక్టోబరు 1: కార్యదీక్ష దీక్ష, నైపుణ్యంతో యువత సాధించలేనిదేదీ లేదని గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం(జీజీయూ) చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు పేర్కొన్నారు. జీజీయూలో పీహెచ్‌డీ మొదటి బ్యాచ్ అడ్మిషన్ల ప్రారంభోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విజ్ఞానాన్ని మేధస్సుతో కలిపి సమాజానికి అందించాల్సిన అవసరాలను వివరించారు. అలాగే గైట్ డిగ్రీ కళాశాలలో జరిగిన ఫ్రెషర్స్ డేలో చైతన్యరాజు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జీజీయూ వీసీ యు.చంద్రశేఖర్, డీన్ ఎస్ఎస్ఎన్ రాజు, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్లు ఎం.శ్రీనివాసరావు, టీవీ ప్రసాద్, ఆర్ఎస్‌రాజు, పీఆర్‌కే రాజు, లీలావతి పాల్గొన్నారు.

ప్రపంచ వృద్ధుల దినోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 1: ప్రపంచ వృద్ధుల దినోత్సవం సీనియర్ సిటిజన్స్ ప్రజా సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో ఆర్యాపురం ఏబీ నాగేశ్వరరావు పార్కులోని సీనియర్ సిటిజన్స్ డే కేర్ భవనంలో అశోక్‌కుమార్ జైన్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా 10మంది సీనియర్ సిటిజన్స్ సభ్యులను సత్కరించారు. వక్తలు మాట్లాడుతూ, వృద్ధులు ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, మంచి ఆహారపు అలవాట్లు అలవరచుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి మహంతి లక్ష్మణరావు, కాసాని శంకరరావు,బండి నరేంద్రబాబు, గడ్డం వెంకటరమణ, జామిశెట్టి అప్పాజీ, జేవీవీ రామారావు, తొక్కుల రమేష్ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం అర్బన్: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో సోషల్ వర్కు డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ సీనియర్ సిటిజన్ల ఇబ్బందులు తెలుసుకుని యువత వారికి పరిష్కార మార్గాలను చూపాలన్నారు. డిపార్టుమెంట్ ఇన్‌చార్జి కస్తూరి సీతామహాలక్ష్మి, కార్యక్రమ నిర్వాహకురాలు ఎస్.రాణి తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా నగరంలోని కొంతమంది వృద్ధులను, విద్యార్థుల అవ్వలను ఆహ్వానించి సత్కరించారు. అధ్యాపకులు కుసుమకుమారి, శివాజీ, సత్యం సూర్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజనుల వైద్య సేవలకు రూ.లక్ష విరాళం

అనపర్తి, అక్టోబరు 1: రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో గిరిజనులకు అందిస్తున్న వైద్య సేవల నిమిత్తం అనపర్తిలోని శ్రీరామకృష్ణ సేవా సమితి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేసింది. మంగళవారం స్థానిక స్వామి వివేకానంద సెంటర్‌లో స్వామీజీ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేతులమీదుగా చెక్కును మిషన్ చారిటబుల్ డిస్పెన్సరీ డైరెక్టర్ స్వామి రఘువీరానందజీ మహరాజ్‌కు అందజేశారు.కార్యక్రమంలో తమలంపూడి సుధాకరరెడ్డి, సత్తి దేవదానరెడ్డి, గొలుగూరి భాస్కరరెడ్డి, సమితి అధ్యక్షుడు పడాల సుబ్బారెడ్డి, ఎం.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ ఆవిర్భావ దినోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబర్ 1: భారత ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ ఆవిర్భావ దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అతి తక్కువ ధరలకే సర్వీసులు అందిస్తూ, 4జి సర్వీసులు మొదలు పెట్టిన సందర్భంగా అధికారులు, ఉద్యోగులు ప్లకార్డులతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ సంచార్ భవన్ నుంచి ప్రారంభమై సీతంపేట, పేపర్ మిల్లు, హైటెక్ బస్టాండు, రామాలయం జంక్షన్, దేవీచౌక్ మీదుగా సంచార్ భవన్ చేరింది. కార్యక్రమంలో పీజీఎం పి.రాజు, డీజీఎంలు రాజశేఖర్‌బాబు, సత్యనారాయణ, నాగరాజు, ఏజీఎం బమిడి శ్రీనివాస్, శారద, శైలజ, జయశ్రీ పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ విరమించాలి


విద్యార్థి యువజన సంఘాల పరిరక్షణ దీక్ష




రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 1: కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించే ప్రయత్నాలను విరమించాలని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని నందం గనిరాజు సెంటర్లో విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేయొద్దని కోరుతూ ఉక్కు పరిరక్షణ దీక్ష నిర్వహించారు. మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు, సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ ఈ దీక్షా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వై.భాస్కర్, ఎన్.రాజా, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్, డీవైఎఫ్ఐ నాయకులు వి.రాంబాబు మాట్లాడుతూ విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని కోరారు. సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, ఎన్ఎస్‌యూఐ నాయకులు తారకేశ్, ఎల్ఐసీ నాయకులు కోదండరావు, సీఐటీయూ నాయకులు పవన్, పూర్ణిమరాజు, రామచంద్రరావు, అంగన్వాడీ నాయకురాలు కే.బేబీ రాణి, తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

ఈఎస్ఐ ఆసుపత్రిని సందర్శించిన బీజేపీ నాయకులు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 1: రాజమహేంద్రవరంలోని పేపర్ మిల్లు ఏరియాలో నిర్మాణంలో ఉన్న ఈఎస్ఐ ఆసుపత్రి భవనాన్ని మంగళవారం బీజేపీ నాయకులు సందర్శించారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు తదితరులు ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణ పనులు పరిశీలించారు. ప్రస్తుతం రోగుల ఓపీ చూస్తున్న ఆసుపత్రిని సందర్శించి వైద్యసేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సోము వీర్రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న హాస్పిటల్ భవనాన్ని త్వరగా పూర్తి చేసి కార్మికులకు అందుబాటులోకి తీసుకురానున్నట్టు చెప్పారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి, బేతిరెడ్డి ఆదిత్య, కాలెపు సాయిరాం తదితరులు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



నేడు గాంధీ జయంతి

గాంధీ.. నడిచాడిక్కడ!

ఉమ్మడి తూర్పున బాపూజీ అడుగుజాడలు

మహాత్ముడి జీవితమే.. ఒక మహోద్యమం. చేతిలో ఊతకర్ర.. బక్కపలుచని శరీరం.. అదీ వయస్సుమీరిన రోజుల్లో ఎలాంటి ఆయుధం లేకుండా స్వాతంత్ర్యం సిద్ధించేదాకా జాతి యావత్తునూ ఏకతాటిపై నడిపించాడంటే ఆయనను మహాత్ముడుకాక ఇంకేమంటాం. అందుకే ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ గాంధీజీని ఉద్దేశించి చెప్పినట్టు "కొన్నేళ్ల తర్వాత రక్తమాంసాలు గల ఇలాంటి వ్యక్తి భూమ్మీద నడిచాడని చెబితే రాబోయే ముందు తరాల వారు నమ్మలేరు.." ఎంత గొప్ప నిర్వచనం ఇది. స్వాతంత్ర్య పోరాటం ఉవ్వెత్తున సాగుతున్న సమయంలో మన జాతిపిత దేశమంతటా పర్యటించారు. ప్రజలందరినీ స్వాతంత్ర్య సమరంలోకి దూకేలా ఉత్తేజితమైన ప్రసంగాలు చేశారు. పోరాటంలో ముందుండి నడిపించారు. మన గోదావరి జిల్లాల్లోనూ గాంధీజీ విస్తృతంగా పర్యటించి సమరశంఖం పూరించారు. ఆయన వెంట ప్రజలంతా ఏకమై నడిచారు. స్వరాజ్యం మా హక్కని ముక్తకంఠంతో నినదించారు. స్వాతంత్ర్య పోరులో జైళ్లకెళ్లారు. గాంధీజీ జయంతి సందర్భంగా ఆయన స్మృతులు మళ్లీ ముందుకు..

- రాజమండ్రి (ఆంధ్రజ్యోతి)/ కాకినాడ సిటీ/కరప


రాజమండ్రికి వచ్చింది.. 5 సార్లు

1921 మార్చి 30వ తేదీ రాత్రి గాంధీ తొలిసారిగా రాజమహేంద్రవరంలో అడుగుపెట్టారు. విజయనగరంలో తన పర్యటన ముగించుకుని బెజవాడ మెయిల్‌లో వెళుతూ ఇక్కడి రైల్వే స్టేషన్‌లో ఆహ్వానం మేరకు దిగారు. 1921 ఏప్రిల్ 6వ తేదీన మహాత్మాగాంధీ దంపతులు కాకినాడ నుంచి రాజమహేంద్రవరం సభకు విచ్చేశారు. 1929 మే 6న గాంధీ మూడోసారి వచ్చారు. గాంధీజీ.. సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు టౌన్‌హాల్‌ను సందర్శించినట్టు చెబుతారు. 1933 డిసెంబర్ 24న ఆయన నాల్గోసారి పాల్ చౌక్‌లో ఆయన ప్రసంగించారు. ఐదోసారి అంటే చివరగా 1946 జనవరి 20 రాజమండ్రి వచ్చారు.

దక్షిణాఫ్రికా టూ తుని..

తుని రూరల్ : స్వాతంత్రోద్యమ పర్యటనకు ముందే గాంధీ తునిలో పర్యటించి బస చేశారు. ఆ ప్రాంతం ప్రస్తుతం గాంధీ సత్రంగా పేరుపడింది. 1915లో దక్షిణాఫ్రికా నుంచి భారతదేశానికి వచ్చిన గాంధీజీ దేశ ప్రజల స్థితిగతులను తెలుసుకునేందుకు దేశ పర్యటనలో భాగంగా 1916లో రైలులో మార్గమధ్యలో తునిలో ఆగారు. తునికి ప్రధాన కూడలిగా ఉన్న గొల్లప్రోలు సెంటర్ పక్కనే సత్రం ప్రాంగణంలో ఒక పెద్ద చెట్టు కింద ఈ ప్రాంత వాసులతో సభ నిర్వహించి స్వాతంత్ర్య స్ఫూర్తిని నింపారు. ఆ రాత్రి అక్కడే బస చేసి మరుసటిరోజే పయనమయ్యారు.

కాకినాడలో మ్యూజియం



కార్పొరేషన్(కాకినాడ): స్వాతంత్రోద్యమ సమయం 1921 నుంచి 1929 మధ్యలో మూడుసార్లు గాంధీజీ కాకినాడ వచ్చారు. గాంధీజీ ఇక్కడికి వచ్చినప్పటి విషయాలతో పాటు ఆయన బాల్యం నుంచి స్వాతంత్ర్యం సాధించే వరకు ఉన్న జీవిత ఘట్టాలను తెలియజేస్తూ కాకినాడ కార్పొరేషన్ వెనుక ప్రాంతంలో గాంధీభవన్ ఏర్పాటు చేశారు. ఇందులో గాంధీజీ మ్యూజియం, ఆయన చిత్రపటాలతోపాటు 400 కిలోల కాంస్య విగ్రహం ఏర్పాటుచేశారు. ఆయనను నిత్యం స్మరించుకునేలా గాంధీనగర్‌లో ఓ పార్కుకు గాంధీపార్కుగా, ఓ ప్రాంతానికి గాంధీనగర్‌గా అప్పట్లోనే నామకరణం చేశారు. కాకినాడ గాంధీభవన్ పేరున కరపలో 5.87 ఎకరాల భూమి ఉంది. వేళంగి గ్రామానికి చెందిన మెర్ల వెంకటసుబ్బారావు 1952 ఆగస్టు 5న తన స్వార్జిత భూమిని గాంధీభవన్ ట్రస్ట్‌కు రాసిచ్చారు.

కాకినాడకు మూడుసార్లు..

స్వాతంత్రోద్యమకాలంలో మహాత్మాగాంధీ కాకినాడలో మూడుసార్లు పర్యటించారు. 1921 ఏప్రిల్ 3న కాకినాడలో గాంధీజీ దంపతులు, వారి నాలుగో కుమారుడు రైలు దిగారు. గుర్రపు బండిపై పెద్ద బజారు గుండా జగన్నాథపురంలోని పైడా వెంకట నారాయణ ఇంటికి చేరుకున్నారు. 1923 డిసెంబర్ 28న గాంధీనగర్‌లో జరిగిన అఖిలభారత కాంగ్రెస్ సభలకు జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయి పటేల్ వంటి నేతలు విచ్చేయగా, పరవాడ జైలులో ఉన్న కారణంగా మహాత్మాగాంధీ హాజరు కాలేకపోయారు. ఆ తర్వాత 1930, 1933లలో రెండుసార్లు కాకినాడ వచ్చిన గాంధీ స్వాతంత్రోద్యమ సభల్లో పాల్గొన్నారు.

సీతానగరంలో సత్యాగ్రహాశ్రమం



గాంధీ బసచేసిన చోడవరంలో భవనం ఇదే

సీతానగరం: రాజమహేంద్రవరానికి 25 కి.మీ దూరంలో ఉన్న సీతానగరంలో 1924 నవంబరు 9న వైద్యుడు బ్రహ్మజ్యోస్యుల సుబ్రహ్మణ్యం గోదావరి గట్టుకు సమీపంలో గౌతమి సత్యాగ్రహాశ్రమం పేరుతో ఏర్పాటుచేశారు. దీనికి అల్యూమినియం వ్యాపారి శేట్ జీవన్‌లాల్ ఆర్థిక సాయం అందించారు. ఈ ఆశ్రమాన్ని బాపూజీ రెండుసార్లు సందర్శించడం విశేషం. 1925 ఫిబ్రవరి 4న డాక్టర్ బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం ఇక్కడ గృహ ప్రవేశం జరిపారు. గాంధీజీ తన స్వాతంత్రోద్యమ పర్యటనలో భాగంగా 1929 మే 8, 9 తేదీల్లో ఆశ్రమంలో బస చేశారు. 1933 డిసెంబరులో ఈ ఆశ్రమానికి రెండోసారి వచ్చి ఆశ్రమవాసులను ఉత్తేజపర్చారు. బాపూజీ సతీసమేతంగా ఆశ్రమంలో విశ్రాంతి తీసుకున్నారు. కస్తూర్బాగాంధీ పరమపదించిన అనంతరం ఆమె పేరుతో గౌతమి సత్యాగ్రహాశ్రమానికి కస్తూర్బాగాంధీ ఆశ్రమంగా పేరు మార్చారు.

నేటికీ ఆ గాంధీ భవన్‌లు పదిలమే!

ద్రాక్షారామ/రాజోలు: మహాత్మాగాంధీ స్వాతంత్ర్య పోరాటంలో 1929 ఏప్రిల్, మే నెలల్లో ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించారు. మే నెలలో రామచంద్రపురం మండలం వెల్ల, చోడవరం గ్రామాల్లో గాంధీజీ పర్యటించారు. మే 1న వెల్ల వంతెన వద్ద బహిరంగ సభలో ప్రసంగించారు. అనంతరం సాయంత్రానికి చోడవరం చేరుకుని రాత్రి బిక్కిన వెంకటరత్నం (మాజీ కేంద్ర మంత్రి) నివాసంలో బసచేశారు. ఆ భవనం ఇప్పటికీ చెక్కు చెదరలేదు. 1929 మే 5న ఆదివారం గాంధీ అమలాపురం మీదుగా సాయంత్రం 6 గంటలకు మామిడికుదురు మండల పాశర్లపూడి రేవు దాటారు. గాంధీ తన సహచరి కస్తూరిబాతో రాత్రి 8 గంటలకు పొన్నాడ సూర్యారావు ఇంటికి అతిథిగా విచ్చేశారు. వారికి అపూర్వమైన ఆతిథ్యాన్ని సూర్యారావు అందించారు. ఆ రాత్రి గాంధీజీ మౌనవ్రతం చేశారు. 1929 మే 5, 6 తేదీల్లో పొన్నాడ సూర్యారావు ఇంట్లోనే గాంధీ బస చేయడం విశేషం. అప్పటి నుంచి ఆ ఇల్లు గాంధీ హౌస్ అయింది.



తొలిరోజే.. 98.43

పింఛన్ల పంపిణీలో అద్వితీయం

- రాష్ట్రంలో రెండో స్థానం
- సచివాలయ సిబ్బంది పట్టుదల
- ఉదయం 5 నుంచే ఆరంభం
- రాత్రి 8 గంటల వరకూ పంపిణీ
- ఇంటింటికీ వెళ్లి అందజేత
- కోలమూరు సర్వేయర్ చేతివాటం
- సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు

రాజమహేంద్రవరం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) :ఓ విజన్.. ఓ పద్ధతి.. ఓ ప్రణాళిక.. ఈ విధానమే కూటమి ప్రభుత్వం వచ్చాక ఒకటో తేదీన ఠంచనుగా పింఛను చేతికందిస్తోంది.. చంద్రబాబు అధికారంలోకి వస్తే ఎలా ఉంటుందో పింఛను నుంచే చేసి చూపిస్తున్నారు. వలంటీర్లు లేకపోయినా తొలి రోజునే ఏకంగా 98 శాతానికి పైగా లబ్ధిదారులకు అందజేసి రికార్డు సృష్టిస్తున్నారు. ఈ నెల కూడా మంగళవారం తెల్లవారుజాము నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభించారు.మంగళవారం ఉదయం 5.30 గంటలకు యాప్ ఓపెన్ అయ్యింది. ఆ మరుక్షణమే 4,896 మంది సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు చేరుకొని రూ.4 వేల పింఛను సొమ్మును చేతిలో పెట్టారు. ఉదయం 8 గంటలకే 78% పింఛన్లు పూర్తయ్యాయి. దీంతో తూర్పుగోదావరి జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలోకి చేరింది.తర్వాత 12 గంటలకు 95 శాతం, సాయంత్రం 7 గంటలకు 98.37 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయింది. అంటే సుమారు 14 గంటల్లో జిల్లాలో మొత్తం 2,39,021 పింఛను లబ్ధిదారులు ఉండగా సాయంత్రం 7 గంటల సమయానికి 2,35,123 మందికి పింఛన్లు అందజేశారు. రాత్రి 8 గంటలకు 98.43 శాతం పింఛన్లు అందజేశారు.రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలిచారు. వివిధ కారణాలతో ఇళ్ల వద్ద లేకపోయిన వాళ్లు మినహా దాదాపుగా అందరు లబ్ధిదారులు పింఛను అందుకొన్నారు.

71 బ్రాంచిలు.. రూ.101 కోట్లు డ్రా

జగన్ ప్రభుత్వంలో పింఛన్ల పంపిణీ పెద్ద క్రతువులా వారం రోజులు సాగేది. అయితే కూటమి ఓ పద్ధతి ప్రకారం పింఛన్ల పంపిణీ చేస్తుండడంతో అటు లబ్ధిదారులు, ఇటు ఉద్యోగుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. జిల్లా కలెక్టర్ ప్రశాంతి పక్కా ప్లానింగ్ చేస్తున్నారు. డీఆర్‌డీఏ పీడీ సమన్వయం చేసుకుంటున్నారు. పింఛన్ల పంపిణీకి ముందు రోజున లబ్ధిదారులకు ఓ మెసేజ్ పంపిస్తున్నారు. రేపు ఉదయం ఇంటికి వచ్చి పింఛను అందజేస్తాం.. అందుబాటులో ఉండాలని దాని సారంశం. మరోవైపు డబ్బులు బ్యాంకుల నుంచి డ్రా చేసి సిబ్బందికి అందజేసే ప్రక్రియ జరుగుతోంది. ఈ నెలకు సంబంధించి మొత్తం 71 బ్యాంకు బ్రాంచిల్లో రూ.101 కోట్లను సోమవారం సాయంత్రమే డ్రా చేశారు. వాటిని సిబ్బందికి పంపిణీ చేశారు. దీంతో మంగళవారం తెల్లవారుజామున యాప్ ఓపెన్ కాగానే అప్పటికే సిద్ధంగా ఉన్న సిబ్బంది పింఛన్ల పంపిణీని మొదలు పెట్టారు.

కోలమూరులో సర్వేయర్ చేతివాటం



రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 1 : రాజమహేంద్రవరం రూరల్ మండలం కోలమూరు సచివాలయం-2 లో సర్వేయర్ కె.వెంకటాచారి చేతివాటం ప్రదర్శించి సస్పెన్షన్‌కు గురయ్యారు.ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో భాగంగా లబ్ధిదారులకు చెల్లించాల్సిన రూ.4 వేలలో రూ.300 తగ్గించి పంపిణీ చేస్తున్నాడు.ఇదేంటని లబ్ధిదారులు ప్రశ్నించగా కొందరి వద్ద దసరా మామూళ్లు అని మరికొందరి వద్ద వరద బాధితులకు పంపాలంటూ పొంతన లేని కారణాలు చెప్పడంతో లబ్ధిదారులు పంచాయతీ కార్యదర్శితో పాటు టీడీపీ నాయకులకు సమాచారం అందించారు.ఈ మేరకు లబ్ధిదారులు సమక్షంలో వెంకటాచారిని విచారించి రూ.300 ఇప్పించామని కార్యదర్శి విజయ్‌రెడ్డి తెలిపారు. 18 మంది లబ్ధిదారులకు రూ.300 తక్కువ ఇచ్చినట్టు గుర్తించామన్నారు. దీనిపై తగు చర్యలు నిమిత్తం రూరల్ ఎంపీడీవోకు నివేదిక పంపించారు.ఈ మేరకు సమాచారం అందడంతో కలెక్టర్ ప్రశాంతి వెంటనే సస్పెన్షన్ చేశారు.


విజ్జేశ్వరంలో పింఛను అందజేస్తున్న మంత్రి దుర్గేష్

అర్హులందరికీ పింఛన్లు : దుర్గేష్

నిడదవోలు, అక్టోబరు 1 : కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీకి కట్టుబడి జిల్లా వ్యాప్తంగా 2,39,021 మందికి రూ.101.95 కోట్లు సామాజిక భద్రత పింఛన్లు ఇంటి వద్దనే పంపిణీ చేస్తున్నామని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు మండలం విజ్జేశ్వరం గ్రామంలో మంగళవారం ఎన్టీఆర్ భరోసా పింఛను పంపిణీ చేసి మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు అందిస్తున్నామన్నారు. విజ్జేశ్వరం గ్రామానికి చెందిన బ్రెయిన్ ఆపరేషన్ జరిగిన పేషెంట్ సత్యనారాయణకు రూ.15 వేలు పెన్షన్ అందించారు.

నవరాత్రి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు : ఎస్పీ

రాజమహేంద్రవరం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : నవరాత్రి ఉత్సవాలకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశామని.. ఉత్సవ నిర్వహణా కమిటీలు.. ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్పీ నరసింహ కిషోర్ పేర్కొన్నారు. నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి దేవీచౌక్ తదితర చోట్ల మంగళవారం ఎస్పీ పరిశీలన చేసి ఉత్సవ నిర్వాహకులతో చర్చించి పలు సూచనలు చేశారు.ఎలాంటి అవాంఛనీయ ఘటనలకూ తావు లేకుండా సిబ్బందిని నియమించామన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఎక్కడైనా అశ్లీల నృత్యాలు, అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉత్సవ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలన్నారు.

పట్టాభూముల్లోనూ ఇసుక తీతలు
8
కొవ్వూరు గొడవల్లో 21 మందిపై కేసు

రూ.6 లక్షలు నొక్కేసి.. 25 మందిని వదిలేశారు?

- ఖాకీలకు వాటాల్లో తేడా..
- రంగంలోకి ఎస్పీ..
- డీఎస్పీ రహస్య విచారణ

రాజమహేంద్రవరం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): జూద శిబిరానికి వెళ్లారు.. పేకాట ఆడుతున్న వాళ్లను చప్పున పట్టేశారు.. చట్ట ప్రకారం నడుచుకుంటే జేబు నిండుతుందా?అని ఎప్పటి మాదిరిగానే అనుకున్నారు.. చట్టాలను బ్రేక్ చేశారు.. కొంత వెనక్కి ఇచ్చేశారు.. మరి కొంత నొక్కేశారు.. వడ్డించుకోవడంలో తేడాలు రావడంతో ఆ ఖాకీల బాగోతం జిల్లా పోలీస్ బాస్ చెవిలో పడింది. దీంతో ఎస్పీ నరసింహ కిషోర్ రహస్య విచారణకు ఆదేశించారు. గత నెల 8న జరిగిన ఈ కథను ఆరాతీస్తే.. పెరవలి మండలం ముక్కామల గ్రామ పరిధి పశ్చిమ, తూర్పుగోదావరి సరిహద్దులో పేకాట శిబిరం నిర్వహిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. పెరవలి ఎస్ఐ ముగ్గురు సిబ్బందితో కలిసి వెళ్లి శిబిరంపై దాడి చేశారు.సుమారు 30 మందిని అదుపులోకి తీసుకున్నారు. వాళ్ల వద్ద ఉన్న దాదాపు రూ.8 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. కాస్త హడావుడి అనంతరం బేరం కుదిరింది. రూ.50 వేలు కేసులో చూపించారు.జూదరులకు రూ.1.50 లక్షలు తిరిగిచ్చేశారు. మిగతా రూ.6 లక్షలు యూనిఫాంలో తోసేశారు.30 మంది పట్టుబడితే ఒప్పందం ప్రకారం ఐదారుగురిని కేసులో చూపించారు. ఎందుకంటే వీరిలో పలువురు వైసీపీ నాయకులు ఉన్నట్టు సమాచారం. వాటాల పంపకాల్లో తేడాలు రావడంతో నిఘా విభాగానికి ఉప్పందింది.సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ అంతర్గత విచారణకు ఆదేశించారని సమాచారం. దీంతో గత మూడు రోజులుగా ఆ రోజు పోలీసులు దాడి చేసినప్పుడు దొరికిన నిందితులు అందరినీ విడతల వారీగా రప్పించి కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ రహస్యంగా విచారణ చేస్తున్నారు.ఆ రోజు తమ దగ్గర డబ్బులు నొక్కేసి, కేసు నుంచి తప్పించిన విషయం వాస్తవమేనని నిందితులు ఒప్పుకున్నట్టు తెలుస్తోంది. నిడదవోలు సీఐకి మొత్తం తతంగం తెలుసని పెరవలి ఎస్ఐ చెబుతుంటే.. తనకు ఏమీ తెలియదని సీఐ అంటున్నారని చెబుతున్నారు. ప్రజాప్రతినిధుల సహాయంతో బయట పడే పనిని ఎస్సై, సీఐ మొదలు పెట్టారని సమాచారం.



ముందడుగు!

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

- కొత్త మద్యం పాలసీ విడుదల
- 9 వరకూ దరఖాస్తుల స్వీకరణ
- జిల్లాలో 125 ప్రైవేటు షాపులు
- 11న లాటరీ.. 12 నుంచి అమలు
- నేతల తీవ్ర ప్రయత్నాలు

మందుబాబులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ప్రైవేటు మద్యం షాపులు విజయదశమి నుంచి అందుబాటులోకి రానున్నాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో నాసిరకం మద్యంతో నలిగిపోయిన మద్యపాన ప్రియులకు కాస్త సాంత్వన కలగనుంది. నాణ్యమైన మద్యం సరసమైన ధరకే గొంతులో పడనుంది.ఈ మేరకు మంగళవారం కూటమి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది.జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సీహెచ్ లావణ్య జిల్లా లైసెన్సింగ్ అథారిటీ హోదాలో గజిట్ నోటిఫికేషన్‌ని విడుదల చేశారు.

జిల్లాలో 125 షాపులు

జిల్లాలోని ఒక కార్పొరేషన్,రెండు మునిసిపాలిటీలు, 18 పంచాయతీలతో కలిపి మొత్తం 125 ప్రైవేటు మద్యం షాపులకు నోటిఫికేషన్ విడుదల చేశారు. దీని ప్రకారం 9వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.10న శాఖాపరమైన ప్రక్రియ జరుగుతుంది. 11న రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో కలెక్టర్ ప్రశాంతి సమక్షంలో ఉదయం 8 గంటల నుంచి లాటరీ తీస్తారు. 12న విజయ దశమి నాటి నుంచి కొత్త మద్యం షాపులు అందుబాటులోకి వస్తాయి.ముందుగా ప్రొవిజనల్ లైసెన్సు జారీ చేస్తారు.అనంతరం షాపులను తనిఖీ చేసి నిబంధనల మేరకు ఉంటే రెగ్యులర్ లైసెన్స్ ఇస్తారు.ఇక, దరఖాస్తు రుసుం రూ.2లక్షలుగా నిర్ణయించారు.షాపు లాటరీలో రాకున్నా ఈ డబ్బులను వెనక్కి తిరిగివ్వరు. రాజ మహేంద్రవరం అర్బన్ పరిధిలో 28,రూరల్ మండలంలో 11, ఇతర మండలాల్లో 90 షాపులకు నోటిఫికేషన్ ఇచ్చారు. లైసెన్సు ఫీజు రెండు నెలలకోసారి చెల్లించే అవకాశాన్ని కల్పించారు.

ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు ఇక్కడే?

ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అధిక శాతం మంది ఆఫ్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకొనే అవకాశం కనిపిస్తోంది. రాజమహేంద్రవరం సిటీలోని 1-15, 23, 24, 29-50 డివిజన్లు రాజమహేంద్రవరం నార్త్ ఎక్సైజ్ స్టేషన్. 16-22, 25-28 డివిజన్లు రాజమహేంద్రవరం సౌత్ స్టేషన్‌లో దరఖాస్తులు సమర్పించవచ్చు. సీతానగరం స్టేషన్‌లో కోరుకొండ, సీతానగరం, గోకవరం, కొవ్వూరు స్టేషన్‌లో కొవ్వూరు, తాళ్లపూడి, చాగల్లు, దేవరపల్లి స్టేషన్‌లో గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల, నిడదవోలు స్టేషన్‌లో నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం, రంగంపేట స్టేషన్‌లో అనపర్తి, రంగంపేట, బిక్కవోలు దరఖాస్తులు చేసుకోవచ్చు.

నేతల పట్టు?

బినామీ పేర్లతో మద్యం దుకాణాలు దక్కించుకొని ఆ వ్యాపారాన్ని తమ గుప్పిట్లో పెట్టుకోవాలని వైసీపీ నేతలు వ్యూహరచన చేస్తున్నారు.జిల్లాలోని వైసీపీ మాజీ ప్రజాప్రతినిధులు ఈ పనుల్లో బిజీగా ఉన్నారు. ఓ సామాజిక వర్గానికి చెందిన వాళ్లు ఈ వ్యాపారంలో ఎక్కువగా ఉన్నారు. ఆ సామాజికవర్గం జగన్‌కి కొమ్ముకాస్తూ ఉంటుందనేది బహిరంగ రహస్యం.ఈ మేరకు తమకు సహకరించాలంటూ ఇప్పటికే ఎక్సయిజ్ శాఖలోని కొందరు అధికారులకు ఇప్పటికే తాయిలాలు ఎరగా చూపుతున్నట్టు చెబుతున్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో సొమ్ములతో మళ్లీ మంచి పోస్టింగ్‌లు పట్టుకున్న ఆ అధికారులు లోపాయికారిగా ఒప్పందాలకు సై అన్నట్టు శాఖావర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మరోవైపు కూటమి నేతలు చాలా మంది మద్యం షాపులను ఎలాగైనా దక్కించుకోవాలని చూస్తున్నారు.ఈ మధ్య ఎక్సయిజ్ శాఖలో బదిలీలు జరిగాయి.స్టేషన్లు, ప్రాంతాల ప్రకారం ధరలు నిర్ణయించి పోస్టింగ్‌లకు సిఫారసు లేఖలు ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయి.దీంతో వైసీపీకి అనుకూలమైన అధికారులకు కీలకమైన సీట్లు దక్కాయి. సిఫారసు లేఖలు ఇచ్చే సమయంలో తాము మద్యం షాపులకు దరఖాస్తు చేస్తామని అమ్మకాలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో షాపులు తమకు దక్కేలా సహాయం చేయాలని 'మాట' తీసుకున్నట్టు చెబుతున్నారు.

ఎక్కడెక్కడ ఎన్ని..

మండలం	షాపులు
రాజమండ్రి అర్బన్	28
రాజమండ్రి రూరల్	11
అనపర్తి	06
బిక్కవోలు	05
చాగల్లు	04
దేవరపల్లి	05
గోకవరం	05
గోపాలపురం	03
కడియం	06
కోరుకొండ	04
కొవ్వూరు అర్బన్	03
కొవ్వూరు రూరల్	05
నల్లజర్ల	06
నిడదవోలు రూరల్	05
నిడదవోలు అర్బన్	04
పెరవలి	05
రాజానగరం	07
రంగంపేట	02
సీతానగరం	02
తాళ్లపూడి	04
ఉండ్రాజవరం	05
మొత్తం	125

గీత కార్మికులకు మరో నోటిఫికేషన్

కల్లుగీత గీత కార్మికులకు మద్యం షాపుల్లో 10 శాతం రిజర్వేషను కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. దానికి సంబంధించి మరో నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ప్రస్తుతం జిల్లాలో 125 షాపులకు నోటిఫికేషన్ విడుదలైంది. అంటే కల్లుగీత కార్మిక వర్గాలకు 12/13 షాపులను కేటాయించే అవకాశం ఉంది. ప్రస్తుత నోటిఫికేషన్‌లో షాపులు దక్కని వాళ్లుఆ కార్మిక వర్గాలను ప్రసన్నం చేసుకునే అవకాశం ఉంది.

లాటరీ పారదర్శకంగా నిర్వహిస్తాం..



కొత్త మద్యం పాలసీ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా ఆరోపణలకు తావు లేకుండా నిర్వహిస్తాం. దరఖాస్తు తనిఖీ ప్రక్రియ అంతా ప్రభుత్వ నిబంధనలకు లోబడి జరుగుతుంది. నిబంధనలు పరిశీలించుకొని తగు పత్రాలు, సమాచారాన్ని జత చేసి దరఖాస్తులను సమర్పించాలి. **- లావణ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్**


నిడదవోలులో బార్ వద్ద బైక్‌ల బారులు

మందుబాబుల క్యూ

సర్కారు షాపులు మూత..బార్ల వద్ద రద్దీ

నిడదవోలు, అక్టోబరు 1 : ప్రభుత్వ మద్యం దుకాణాలు మూతపడడంతో మద్యం ప్రియులంతా బార్లకు పోటెత్తారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ మద్యం దుకాణాలకు సోమవారంతో గడువు ముగిసింది. దాంతో పాటు మద్యం దుకాణాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది కాంట్రాక్ట్ గడువు ముగిసింది. కూటమి ప్రభుత్వం కొత్త మద్యం పాలసీ అమల్లోకి వచ్చే అక్టోబరు 12వ తేదీ వరకు ప్రభుత్వ మద్యం దుకాణాలు తెరిచేలా అనుమతులిచ్చింది. కానీ కొన్నిచోట్ల కాంట్రాక్ట్ సిబ్బంది విధులకు హాజరుకాకపోవడంతో మంగళవారం నుంచి జిల్లావ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో మద్యం దుకాణాలు మూతపడ్డాయి. దీంతో మద్యం ప్రియులు బార్ల వద్ద క్యూకట్టారు. దీంతో బార్ల వద్ద ఇసుకేస్తే రాలని పరిస్థితి నెలకొంది. నిడదవోలు పట్టణ పరిధిలో మూడు, మండలంలో ఏడు ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నాయి. సోమవారం మొత్తం 7 షాపులు మూతపడ్డాయి. ఇప్పటికే పట్టణంలో మూడు బార్లకు గాను లైసెన్స్ ఫీజులు భారమై రెండు మూతపడ్డాయి.ఈ నేపథ్యంలో గణేష్‌చౌక్ సెంటరులో మిగిలి ఉన్న ఒకే ఒక్క బార్ అండ్ రెస్టారెంటు మద్యం ప్రియులతో కళకళలాడింది. బయట పార్కింగ్‌కు సైతం ఖాళీ లేక మద్యం ప్రియులు తమ మోటారు సైకిళ్లను రోడ్లపై పార్క్ చేశారు. సోమవారం ప్రభుత్వ మద్యం దుకాణాలు మూతపడగా బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకుని ఎలాగూ మూసివేస్తారు.ఎక్సైజ్ సిబ్బంది గురువారం నుంచి మద్యం షాపులు తెరచి విక్రయాలు సాగిస్తారని సమాచారం. దీం తో మందుబాబు మంగళవారం తెగతాగేశారు. బుధవారం సెలవు కావడంతో బాటిళ్లకు కొనుగోలు చేసి తీసుకెళ్లారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఆ..ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి
విద్యాశాఖ తీరుపై ఏపీటీఎఫ్ అసంతృప్తి

కొవ్వూరు, అక్టోబరు 1: గాంధీ జయంతిని పురస్కరించుకుని తూర్పు గోదావరి జిల్లాలోని అన్ని పాఠశాలలు పనిచేయాలన్న ఉత్తర్వులపై ఏపీటీఎఫ్ అభ్యంతరం తెలిపింది. వెంటనే ఈ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాలలకు అక్టోబరు 3 నుంచి దసరా సెలవులు ప్రకటిస్తుందన్న వార్తలు వస్తున్న నేపథ్యంలో 2న గాంధీ జయంతి సెలవు కూడా కలిసి వస్తుందని భావించి ఉపాధ్యాయులు పలు ప్రయాణాలు పెట్టుకున్నారని ఏపీటీఎఫ్ పేర్కొంది. విద్యాశాఖ అధికారులు ఒక్క తూర్పు గోదావరి జిల్లాలోనే గాంధీ జయంతి రోజున అన్ని పాఠశాలలు పనిచేయాలని ఉత్తర్వులు విడుదల చేయడాన్ని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.దుర్గారావు, పి.సువర్ణరాజు అభ్యంతరం తెలిపారు. తక్షణం విద్యాశాఖ అధికారులు ఆ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు.

తొమ్మిది ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అనుమతి

గోపాలపురం, అక్టోబరు 1: ఖరీఫ్‌లో రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఆయా గ్రామాల్లో 9 చోట్ల రైతుసేవా కేంద్రాల అనుమతి లభించినట్లు వ్యవసాయాధికారి రాజారామ్ తెలిపారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలోనూ టెక్నికల్ అసిస్టెంట్‌తో పాటు డీఈవో, హెల్పర్ ఉంటారని వీరిపై పర్యవేక్షణకు రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ, ఉద్యాన సిబ్బంది ఇన్‌చార్జ్‌గా ఉంటారని అన్నారు. గతంలో మాదిరిగా కాకుండా ఈ ఏడాది రైతు తనకు నచ్చిన రైసుమిల్లులో ధాన్యం అమ్ముకోవచ్చన్నారు. ఈ నెల 15 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతాయన్నారు.

రక్తదానంతో పలువురికి ప్రాణదానం

నల్లజర్ల, అక్టోబరు 1: లయన్స్ క్లబ్ దూబచర్ల, పార్డ్ ఇండియా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా మంగళవారం దూబచర్ల ఏలైట్ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించగా 30 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ మాట్లాడుతూ రక్తదానంతో అనేక మంది ప్రాణాలను కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో క్యాంపు ఆర్గనైజర్ అంబటి శ్రీనివాసరావు, ఎలైట్ ప్రిన్సిపాల్ కలగర శ్రీలక్ష్మి, షరీఫ్, చీమకుర్తి కృష్ణప్రసాద్, రత్నం పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నల్లజర్ల, అక్టోబరు 1: నల్లజర్ల మండలం చీపురుగూడెం గ్రామానికి చెందిన వసంతాడ మధుబాబు దంపతులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. దీంతో వైద్య ఖర్చుల నిమిత్తం మండల మానవత సంస్థ రూ.15 వేల ఆర్థికసాయాన్ని మధుబాబు తల్లికి మంగళవారం అందజేశారు. అదే విధంగా మధుబాబుతో కలిసి టెన్త్ పూర్వపు విద్యార్థులు రూ.45 వేలు, చీపురుగూడెం గ్రామానికి చెందిన చెల్లు తిరుమల శ్రీనివాస్ రూ.5 వేలు, నల్లజర్ల మీనార్ మసీదు రూ.10వేలు, ఎంకే లైవ్ ఫౌండేషన్ రూ.4 వేలు ఆర్థికసాయం చేశారు. అనంతపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న తెప్పల అబ్బులు, తమిర్చి సరోజిని, సింగదాసు కమలకుమారి, తగరం వెంకమ్మకు ఒక్కొక్కరికి రూ.4 వేలు అందించారు. కార్యక్రమంలో మండల మానవత కన్వీనర్ గుళ్ళపూడి వెంకటరత్నం, భోగవల్లి వెంకట సుబ్బారావు, కోశాధికారి ఐడీవీ అప్పారావు, చెల్లు సుబ్రహ్మణ్యం, చెల్లు వీరవెంకట్రావు, మండల మానవత సహాయ కార్యదర్శి గుండబత్తుల వరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులను సన్మానిస్తున్న కొవ్వూరు లయన్స్ క్లబ్ సభ్యులు

పెద్దల అనుభవాలు యువతకు ఆదర్శం

కొవ్వూరు, అక్టోబరు 1: పెద్దల అనుభవాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని కొవ్వూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మద్దిపాటి వీవీ సత్యనారాయణ అన్నారు. కొవ్వూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య కల్యాణ మండపంలో అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త రెడ్డి తాతయ్యబాబు, యూనియన్ బ్యాంకు విశ్రాంత మేనేజర్ పులపా సత్యనారాయణ, సాయి సేవాదళ్ సభ్యుడు కారంచేటి హనుమంతరావు, మున్సిపల్ హైస్కూల్ విశ్రాంత పీఈటీ ఎస్.లక్ష్మీపతిరాజు, కోడూరి లక్ష్మీ ప్రసాద్‌లను సత్కరించారు. ఈ సందర్భంగా హనుమంతరావు, తాతయ్యబాబు మాట్లాడారు. కార్యక్రమంలో నాళం శ్రీనివాసరావు, పాలింపాటి చిన్నబాబు, ఉప్పులూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో: అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కొవ్వూరు వాత్సల్య వృద్ధాశ్రమంలో మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. వృద్ధుల హక్కుల పరిరక్షణకు వారికి ఉచిత న్యాయ సహాయం అవసరమైతే మండల న్యాయ సేవా సంస్థను సంప్రదించాలని ప్యానెల్ న్యాయవాది పీవీపీ లక్ష్మి తెలిపారు. సీనియర్ సిటిజన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కొవ్వూరు వాత్సల్య వృద్ధాశ్రమంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు.

వృద్ధాశ్రమానికి ఫ్యాన్లు అందజేత

దేవరపల్లి, అక్టోబరు 1: ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా దేవరపల్లి మండలం కృష్ణంపాలెంలోని అంబేడ్కర్ వృద్ధాశ్రమానికి యర్నగూడెం బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్ మేనేజర్ గుడివాడ సురేంద్రకుమార్ నాయుడు వృద్ధులకు పండ్లు, స్వీట్లు అందజేశారు. దీంతోపాటు ఆరు సీలింగ్ ఫ్యాన్‌లను ఆశ్రమ నిర్వాహకురాలు గుదే శ్యామలాదేవికి అందజేశారు.

పట్టా భూముల్లోనూ ఇసుకతీతలు

• ఓపెన్ ర్యాంపులకు టెండర్లు పిలిచే యోచన • ఇంకా అయోమయంలో బోట్స్‌మెన్ సొసైటీలు • గాయత్రీ రెండు ర్యాంపులకు కొలతలు • అనుమతి మేరకు ఇసుక తీయాలి: జేసీ చినరాముడు



గాయత్రీ ర్యాంపులో బోట్స్‌మన్ సొసైటీ సభ్యులతో జేసీ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఇసుక కొరత ఇక కొద్దిరోజులు మాత్రమే. పట్టా భూముల్లో కూడా ఇసుకతీతకు అనుమతిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. దీంతో గోదావరి లంకల్లోని పట్టా భూముల్లో ఇసుక తీసి ఉచిత విధానంలో సరఫరా చేయవచ్చు. ఈనెల 15 తర్వాత ఓపెన్ ర్యాంపులు కూడా అమల్లోకి వచ్చే అవకాశముంది. ప్రస్తుతం బోట్స్‌మన్ సొసైటీల ద్వారా డీసిల్టేషన్ కూడా మొదలవుతోంది. ఇవన్నీ మొదలైతే జిల్లాలో ఇసుక కొరత అనేదే ఉండదు. ఇతర ప్రాంతాలకు కూడా సరఫరా చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం డీసిల్టేషన్ పాయింట్లలో ఇసుకతీత ఇంకా అయోమయంలో ఉంది. మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చినరాముడు ఆధ్వర్యంలో ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, మైన్స్ ఏడీ డి.ఫణిభూషణ్, ఇరిగేషన్ హెడ్‌వర్క్స్ ఈఈ ఆర్.కాశీ విశ్వేశ్వరరావు, మైన్స్ ఏజీ విఘ్నేష్, అర్బన్ తహశీల్దార్ పీహెచ్ పాపారావు, డీఈఈలు, గాయత్రీ ర్యాంపులను పరిశీలించారు. బోట్స్‌మెన్ సొసైటీ సభ్యులతో మాట్లాడారు. వెంటనే ఇసుకతీత ప్రారంభించవలసిన అవసరాన్ని వివరించారు. గాయత్రీ 1, 3 ర్యాంపులను ఒక ర్యాంపుగా, 2, 4 ర్యాంపులను మరో ర్యాంపుగా గుర్తించి కొలతలు వేయించారు. ఇప్పటికే అక్కడ సుమారు 20 బోట్స్‌మెన్ సొసైటీలకు అనుమతిచ్చారు. ఏ పాయింట్‌లో ఎవరు ఇసుకపోగు పెట్టాలనేది స్పష్టం చేయలేదు. అధికారుల సూచన మేరకు కొందరు సుమారు 15వేల టన్నుల ఇసుకను తీసి గుట్టపెట్టారు. రేపోమాపో మరికొందరు ఇసుక తీస్తారు. వీరంతా ఇసుక ఎక్కడ వేయాలనేది కూడా స్పష్టత లేకపోవడంతో అందరూ అయోమయంలో పడ్డారు. వీరికి డబ్బు ఎవరిస్తారనేది కూడా ఇంకా స్పష్టత లేదు. ఈ నెల 11న తర్వాత బోట్స్‌మెన్ సొసైటీలన్నింటి ద్వారా ఇసుక తీయించడానికి ఒక ఏజెన్సీ వస్తుందనే ప్రచారం ఉంది. అప్పటి వరకూ ఇసుకతీత ఒక తతంగం మాదిరిగా ఉండవచ్చనే అంచనా ఉంది. త్వరలో ఓపెన్ ర్యాంపులు అమలులోకి రానున్నాయి. అవి సుమారు 31 వరకూ ఉండవచ్చు. వాటి నిర్వహణకు టెండర్లు పిలిచే ఆలోచన ఉన్నట్టు సమాచారం.

సరఫరా సామర్థ్యాన్ని పెంచాలి
జాయింట్ కలెక్టర్

ప్రభుత్వం ఇచ్చిన అనుమతి మేరకు ఇసుకతీత, సరఫరా ఉండాలని జాయింట్ కలెక్టర్ ఎస్.చినరాముడు చెప్పారు. గాయత్రీ ర్యాంపులను పరిశీలించిన ఆయన బోట్స్‌మెన్ సొసైటీ సభ్యులతో మాట్లాడారు. మంగళవారం 15వేల టన్నుల ఇసుక తీసినట్టు బోట్స్‌మెన్ సొసైటీలు చెప్పాయి. ఈ ర్యాంపుల నుంచి రెండు లక్షల మెట్రిక్ టన్ను ఇసుక లభ్యత ఉంటుందని అధికారులు జేసీకి తెలిపారు. ప్రతిరోజూ ఇసుక సరఫరా సామర్థ్యాన్ని పెంచాలని జేసీ ఆదేశించారు.

ప్రకృతి వ్యవసాయంతో వనరుల పరిరక్షణ

చాగల్లు, అక్టోబరు 1: ప్రకృతి వ్యవసాయంతో వనరుల పరిరక్షణ సాధ్యమని ప్రకృతి వ్యవసాయం అధికారిణి మహారాణి అన్నారు. మంగళవారం నెలటూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిస్త్రం కషాయం పిచికారి చేయడం వల్ల వరిని ఆశించే తెగుళ్ళు నివారణ చేయడంతో పాటు ముప్వపోటు, ఊసపోటు ఎలక కొట్టడం మొదలైన సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కే.వేణు గోపాలకృష్ణ, వీహెచ్ఏ రాజేష్, రత్నకుమారి, పొలవేణి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి అపుస్మా నాయకుల విరాళం



ఎమ్మెల్యేకు చెక్కు అందజేస్తున్న అపుస్మా నాయకులు

కొవ్వూరు, అక్టోబరు 1: వరద బాధితుల సహాయార్థం కొవ్వూరు జోన్ అపుస్మా నాయకులు సీఎం సహాయనిధికి విరాళం అందజేశారు. కొవ్వూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం అపుస్మా నాయకులు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును కలిశారు. ముఖ్యమంత్రి సహాయనిధికి తమవంతుగా రూ.3,21,000 అపుస్మా జోన్ ప్రెసిడెంటు అనీష్ ఎమ్మెల్యేకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాన్ని అభినందిస్తూ వరద బాధితుల సహాయార్థం అందించిన విరాళాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబుకి అందజేస్తానన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, అపుస్మా నాయకులు పాలింపాటి వెంకటరత్నం, తిమోతి, పి.రామకృష్ణంరాజు, కారుపాటి రాజు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా వరద బాధితుల సహాయార్థం కొవ్వూరుకు చెందిన సద్గురు పాఠశాల కరస్పాండెంటు పాలింపాటి వెంకటరత్నం వరద బాధితుల సహాయార్థం రూ.1,50,000లను సీఎం సహాయనిధికి అందజేయాలని ఎమ్మెల్యేకు అందించారు.



కొవ్వూరు బ్రిడ్జిపేటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి

అర్హులందరికీ సామాజిక పింఛన్లు
ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, అక్టోబరు 1: అర్హులందరికీ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేస్తున్నట్టు కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని 7, 8 వార్డుల్లో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పట్టణంలో 98.28 శాతం లబ్ధిదారులకు పంపిణీ చేసినట్టు మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ తెలిపారు. మండలంలో 95.88 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో కె.సుశీల తెలిపారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, దాయన రామకృష్ణ, బోడపాటి ముత్యాలరావు, బాలదారి ఉమా, కుప్పాల ప్రసాద్, హరిబాబు, సతీష్, బర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

97.95శాతం పంపిణీ

పెరవలి, అక్టోబరు 1: మండలంలో 97.95 శాతం ఎన్‌టీఆర్ భరోసా పింఛన్‌లు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో సింగంశెట్టి రమేష్ తెలిపారు. మిగిలిన పెన్షన్‌దారులకు 2న సాయంత్రంలోపు పంపిణీ చేయడానికి ప్రయత్నిస్తామన్నారు. దీనికి సహకరించిన కూటమి నాయకులకు, ఉద్యోగులకు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

అర్హులందరికీ అందిస్తాం

నిడదవోలు, అక్టోబరు 1: అర్హులందరీ ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందిస్తామని తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం నిడదవోలు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉదయం నుంచే పింఛన్ల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అర్హులందరికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తిరుపతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలన ప్రశంసనీయం

తాళ్ళపూడి, అక్టోబరు 1: మండలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కూటమి పాలన ఎలా ఉందని ఒక వృద్ధురాలిని పలకరించారు. దీంతో ఆ వృద్ధురాలు ఆనందంతో ఎన్టీఆర్ పాలనను గుర్తు చేసుకున్నారు. ఎమ్మెల్యేకు తాళ్లపూడి సర్పంచ్ నక్కా చిట్టిబాబు, ప్రక్కిలంక సర్పంచ్ యాళ్ళ బాబూరావు, ఎన్డీఏ నాయకులు స్వాగతం పలికారు. తాళ్లపూడి రైతు భరోసా కేంద్రంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నామాన పరమేశ్వరరావు, ఇందుగుల రామకృష్ణ తదితరులతో పాటు ఎంపీడీవో రమణ, పంచాయతీ కార్యదర్శులు ఆశా అలేఖ్య, ప్రసాద్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి స్టేట్ జనరల్ సెక్రటరీగా సతీష్

పెరవలి, అక్టోబరు 1: కాకరపర్రుకు చెందిన నేకూరి సతీష్‌ను ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి స్టేట్ జనరల్ సెక్రటరీగా నియమితులయ్యారు. మంగళవారం ప్రెసిడెంట్ బుల్లా రాజారావు నుంచి ఉత్తర్వులు వచ్చినట్టు తెలిపారు. ఈ సందర్భంగా సతీష్‌ను గ్రామానికి చెందిన పలువురు అభినందించారు.

గణేష్ నిమజ్జనం ఊరేగింపు దాడిలో
21 మందికి రిమాండ్

కొవ్వూరు, అక్టోబరు 1: ఇటీవల గణేష్ నిమజ్జనం ఊరేగింపులో శ్రీరామకాలనీ, రాజీవ్‌కాలనీ వాసుల మధ్య దాడికి కారణమైన 21 మందిని రిమాండ్‌కు పంపించినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. కొవ్వూరులోని రాజీవ్‌కాలనీకి చెందిన గణేష్ నిమజ్జనం ఊరేగింపు లో శ్రీరామకాలనీ వద్ద జరిగిన రాళ్ల దాడికి సంబంధించి అప్పట్లో కొంత మందిని పోలీసులు అరెస్టు చేశారు. గతనెల 30న కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ శ్రీరామకాలనీ వాసులపై జరిగిన దాడికి సంబంధించి నమోదు చేసిన ఎస్సీ, ఎస్టీ కేసులో రాజీవ్‌కాలనీకి చెందిన 15 మందిని మంగళవారం అరెస్టు చేశారు. రాజీవ్‌కాలనీ వాసులు అందించిన ఫిర్యాదు మేరకు నమోదు చేసిన కేసులో ఆరుగురిని అరెస్టు చేశారు. మంగళవారం మొత్తం 21 మందిని కొవ్వూరు 2వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించడంతో వారిని రాజమహేంద్రవరం జైలుకు తరలించామన్నారు. ఈ కేసులకు సంబంధించి దర్యాప్తు కొనసాగుతోందని, విచారణ అనంతరం మరికొంత మందిని అరెస్టు చేసే అవకాశం ఉందన్నారు.



కొవ్వూరు ఆంధ్ర గీర్వాణ విద్యాపీఠంలో జాతిపిత మహాత్మాగాంధీకి స్వాగతం పలుకుతున్న ప్రజలు (ఫైల్‌ఫొటో)

కొవ్వూరు సంస్కృత కళాశాలకు గాంధీ

కొవ్వూరు. అక్టోబరు 1: జాతిపిత మహాత్మాగాంధీ కొవ్వూరు ఆంధ్రగీర్వాణ విద్యాపీఠం ప్రాంగణంలోని సంస్కృత కళాశాలకు 1925లో విదేశీ వస్తు బహిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాజమహేంద్రవరంలో విదేశీ వస్తు బహిష్కరణ కార్యక్రమానికి వెళుతూ కొవ్వూరు విచ్చేశారు. రెబ్బాప్రగడ మందేశ్వరశర్మ స్వాగత సమితి అధ్యక్షుడుగా సంస్కృత కళాశాల ఆవరణలో జరిగిన ప్రార్థనా సమావేశంలో గాంధీ పాల్గొన్నారు. అదే ప్రాంతంలో గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుత కొవ్వూరు విజయవిహార్ సెంటర్‌లో అప్పట్లో విదేశీ వస్తు బహిష్కరణలో భాగంగా విదేశీ వస్తువులను తగలబెట్టే కార్యక్రమంలో బాపూజీ పాల్గొన్నారు.

గాంధీ పేరున ఓ ఊరు

దేవరపల్లి, అక్టోబరు 1: గాంధీ మహాత్ముని స్ఫూర్తితో మండలంలోని గాంధీనగరం గ్రామం ఏర్పాటైంది. 1938లో గడా రఘునాయకులు, పిన్నమనేని బ్రహ్మన్న, ఆచంట పెదశేషన్న, చిన్నశేషన్నలు గ్రామానికి నామకరణం ఏర్పాటు చేశారు. పేరుకు తగ్గట్టుగానే ఆ ఊరిలో స్వాతంత్రానికి పూర్వమే గ్రంథాలయం, స్కూల్ ఏర్పాటు చేశారు. ఆ గ్రామంలో వీధులు తూర్పుగోదావరి జిల్లా కాకినాడ పట్టణంలో వీధులను పరిశీలించి ఆ రోజుల్లోనే 30 అడుగులను వీధులను తీర్చిదిద్ది డ్రైనేజీలను కూడా ఏర్పాటు చేశారు. గ్రామాల్లో నేలనుయ్యిలు తవ్వి నీరు తోడడానికి మద్రాసు నుంచి ఇంజన్లు తీసుకొచ్చి బావిలోని నీటిని తోడేవారు. ఆ గ్రామం అంతా ఆహ్లాదంగా, పచ్చని మొక్కలతో మరింత అందంగా ఉంటుంది. 1978లో గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.



గాంధీనగరం గ్రామం

మల్లవరంలో గాంధీజీ స్ఫూర్తి కార్యక్రమాలు

చాగల్లులో గాంధీ ఆశ్రమం



మల్లవరంలోని గాంధీ స్మారక నిధి గాంధీ ఆశ్రమం

చాగల్లు, అక్టోబరు 1: స్వాతంత్ర్య పోరాట సమయంలో మహాత్మాగాంధీ చాగల్లు మండలం మల్లవరం గ్రామానికి 1929 ఏప్రిల్ 29న విచ్చేశారు. విదేశీ వస్తు బహిష్కరణ, స్వదేశీ వస్తు వినియోగం, స్వాతంత్ర్య సాధనపై ఆయన ప్రజలను చైతన్యవంతుల్ని చేశారు. అనంతరం ఆ ప్రాంతం గాంధీ గురుకులంగా మారి విద్యబోధన జరిగింది. 2005 సంవత్సరంలో గాంధీ స్మారక నిధి, సర్వోదయ మండలి ఆధ్వర్యంలో గాంధీజీ స్మారక కేంద్రంగా అభివృద్ధి చెంది ఆయన ఆశయాలు, సిద్ధాంతాలు ప్రచారం చేయడం కోసం ప్రతి సంవత్సరం జయంతి, వర్ధంతులతోపాటుగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆయన ఆశయాలను ప్రచారం చేస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు మాట్లాడుతూ జిల్లా సర్వోదయ మండలి, గాంధీ స్మారక నిధి ఆధ్వర్యంలో మూడు లక్షల మంది విద్యార్థులకు గాంధీ ఆత్మకథ, గాంధీ చరిత్రపై సర్టిఫికెట్ కోర్సులు నిర్వహించినట్టు చెప్పారు.